


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 29-01-2026 | సంపుటి - 26 | సంచిక -250 | రూ : 4 | పేజీలు: 8


### విమాన ప్రమాదంలో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం

# అజిత్ పవార్ దుర్మరణం



2లో

- బారామతి వద్ద విమానం కూలి మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మృతి
- ప్రమాదంలో పైలట్లు, భద్రతా సిబ్బంది సహా మొత్తం ఐదుగురి దుర్మరణం
- ముంబై నుంచి బారామతి వెళ్తుండగా ల్యాండింగ్ సమయంలో ఘటన
- స్థానిక సంస్థల ఎన్నికల సభలకు వెళ్తుండగా జరిగిన విషాదం

## వికసిత్ భారత్‌కు 2026

### పునాది సంవత్సరం : రాష్ట్రపతి ముర్ము



2లో

- పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం
- ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్.. ఈ నెల 29న ఆర్థిక సర్వే ప్రవేశపెట్టనున్న నిర్మల

### మేడారంలో భక్తులకు ధరల షాక్..

# ఆకాశాన్నంటిన రేట్లు..

- ప్రారంభమైన మేడారం సమ్మక్కసారలమ్మ మహాజాతర
- భక్తులను బెంబేలెత్తిస్తున్న ఆకాశాన్నంటిన ధరలు
- కోళ్లు, మేకల ధరలు రెట్టింపు.. గదుల అద్దెలు వేలల్లో
- చెట్టు కింద నీడకు కూడా అద్దె వసూలు చేస్తున్న వైనం
- ధరల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలని భక్తుల విజ్ఞప్తి



2లో




2లో

## శబరిమల బంగారం కేసులో

### కీలక మలుపు.. వీడిన చిక్కుముడి!

- శబరిమల బంగారం కేసులో కీలక శాస్త్రీయ ఆధారాలు
- గర్భగుడి తలుపులను మార్చలేదని తేల్చిన వీఎస్ఎస్‌సీ
- రాగి రేకులపై ఉన్న బంగారు పొరను రసాయనాలతో దోపిడీ
- ఈ మేరకు హైకోర్టుకు నివేదిక సమర్పించిన దర్యాప్తు బృందం
- త్వరలో తుది నివేదిక ఇస్తామని చెప్పిన శాస్త్రవేత్తలు

### నిఫా ఎఫెక్ట్: ఎయిర్‌పోర్టుల్లో మళ్లీ

# కోవిడ్ తరహా స్క్రీనింగ్

- పశ్చిమ బెంగాల్‌లో నిఫా కేసులతో అప్రమత్తమైన ఆసియా దేశాలు
- థాయ్‌లాండ్, నేపాల్, తైవాన్ ఎయిర్‌పోర్టుల్లో కొవిడ్ తరహా స్క్రీనింగ్
- బెంగాల్‌లో రెండే నిఫా కేసులు నమోదయ్యాయని స్పష్టం చేసిన కేంద్రం
- బాధితులతో సంబంధమున్న 196 మందికి నెగెటివ్ అని వెల్లడి




2లో




2లో

# మున్సిపోల్స్ నామినేషన్లు షురూ

- అమెరికా టూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి
- నామినేషన్ల దాఖలుకు తుది గడువు ఈనెల 30 వరకు
- సీఎం రాష్ట్రానికి వచ్చేది ఫిబ్రవరి 2న
- ఫోన్‌ట్యాపింగ్ కేసుల్లో బీఆర్ఎస్ అగ్రనాయకత్వం
- అంతర్గత కుమ్ములాటల్లో బీజేపీ
- 'పుర'పోరుతో రాజకీయం గరంగరం

హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్ల దాఖలు ప్రారంభమైంది. తొలిరోజు దాదాపు 900 నామినేషన్లు దాఖలయ్యాయి. అయితే ఏపార్టీ కూడా ఇప్పటి వరకు తమ అభ్యర్థుల్ని ప్రకటించలేదు. ఆశావహులంతా నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. దీనికి ఇక రెండు రోజులే గడువు ఉంది. 'పుర' పోరు మొత్తం 15రోజుల్లో ముగియనుంది. రాష్ట్రవ్యాప్తంగా తరువాయి 2లో

# మేడారం.. జనసంద్రం

- ఘనంగా మహాజాతర ప్రారంభం
- కొలువు తీరిన సారలమ్మ
- పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు
- గద్దెలకు చేరిన పగిడిద్దరాజు, గోవిందరాజు
- నేడు సమ్మక్క రాక..
- పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు



2లో

# మేడారంలో భక్తులకు ధరల షాక్.. ఆకాశాన్నంటిన రేట్లు..

ములుగు: తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్కసారలమ్మ మహా జాతర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ వేడుకకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. అయితే, వనదేవతలను దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు ధరల మోత తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. జాతర పరిసరాల్లో నిత్యావసరాల నుంచి బస చేసే గదుల వరకు అన్ని ధరలు ఆకాశాన్నంటడంతో సామాన్య భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

*** కోడి, మేకల ధరలు రెట్టింపు.. భక్తుల జేబులకు చిల్లు**

జాతరలో అమ్మవార్లకు మొక్కుగా బెల్లం(బంగారం)తో పాటు కోళ్లు, మేకలను సమర్పించడం ఆనవాయితీ. దీన్నే అదునుగా చేసుకున్న వ్యాపారులు ధరలను విపరీతంగా పెంచేశారు. సాధారణంగా కిలో రూ. 420 పలికే మేకపోతు లైవ్, మేడారంలో రూ. 900 నుంచి రూ. 1000 వరకు విక్రయిస్తున్నారు. ఇక, మటన్ ధర అయితే ఏకంగా రూ. 1500కు చేరింది. బయట మార్కెట్‌లో కిలో రూ. 170-180 ఉండే బ్రాయిలర్ కోడిని ఇక్కడ రూ. 300 నుంచి రూ. 350కి అమ్ముతున్నారు. నాటుకోడి ధర రూ. 700 దాటిపోయింది. జాతర చివరి రోజుల్లో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని భక్తులు వాపోతున్నారు.

*** చుక్కలు చూపిస్తున్న గదుల అద్దెలు**

మాంసం ధరలే కాకుండా, బస కోసం ఏర్పాటు చేసుకునే గదుల అద్దెలు కూడా చుక్కలు చూపిస్తున్నాయి. కనీస సౌకర్యాలు లేని చిన్న గదులకు సైతం రోజుకు రూ. 6,000 వరకు వసూలు చేస్తున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. కేవలం ఒక్క ఫ్యాన్ మాత్రమే ఉన్న గదికి వేలకు వేలు చెల్లించాల్సి వస్తోంది.

*** చెట్ల కింద నీడకు సైతం అద్దె**

ఇక ఇళ్లు, గదులు దొరకని వారు సేద తీరేందుకు చెట్ల నీడను ఆశ్రయిస్తుంటే, అక్కడ కూడా దోపిడీ తప్పడం లేదు. జాతర పరిసరాల్లోని తోటల యజమానులు చెట్ల కింద నీడను సైతం అద్దెకు ఇస్తున్నారు. ఓ కుటుంబం వంట చేసుకుని, భోజనం చేయడానికి ఒక చెట్టు కింద నీడ కోసం రూ. 1000 వరకు వసూలు చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు తప్పనిసరి పరిస్థితుల్లో స్థానికంగానే కొనుగోలు చేయాల్సి రావడంతో, వ్యాపారులు ఈ విధంగా ధరలు పెంచి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దోపిడీని అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

## అజిత్ పవార్ మృతికి ఏపీ కేబినెట్ సంతాపం

అమరావతి: విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మరణించడంపై ఆంధ్రప్రదేశ్ మంత్రిమండలి సంతాపం తెలిపింది. ఈ రోజు ఉదయం జరిగిన కేబినెట్ సమావేశంలో సంతాప తీర్మానం చేసింది. భేటీ ప్రారంభమైన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు అజిత్ పవార్ విమాన ప్రమాద వార్తను ప్రస్తావించారు. ప్రమాదంలో అజిత్ పవార్ మరణించడంపై విచారం వ్యక్తం చేశారు. ప్రమాద విషయం తెలిసి దిగ్భ్రాంతికి లోనయ్యానని చంద్రబాబు చెప్పారు. అజిత్ పవార్ తో తనకున్న పరిచయాన్ని సీఎం గుర్తుచేసుకున్నారు. అజిత్ పవార్ మృతి మహారాష్ట్ర రాజకీయాల్లో తీరని లోటని చంద్రబాబు అన్నారు. అజిత్ పవార్ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ మంత్రులు మౌనం పాటించారు.

## శబరిమల బంగారం కేసులో కీలక మలుపు.. వీడిన చిక్కుముడి!

కేరళ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన శబరిమల గర్భగుడి స్వర్ణ బంధనం (బంగారు తాపడం) చోరీ కేసులో కీలక పురోగతి లభించింది. గర్భగుడి తలుపులను మార్చలేదని, వాటిపై ఉన్న రాగి రేకుల మీద నుంచి బంగారు పొరను మాత్రమే నేర్పుగా దోచుకున్నారని శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది. ఈ మేరకు విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (VSSC) శాస్త్రవేత్తలు సమర్పించిన నివేదికను, ప్రత్యేక దర్యాప్తు బృందం (SIT) బుధవారం కేరళ హైకోర్టుకు సమర్పించింది. ప్రస్తుతం గర్భగుడికి ఉన్నవి అసలైన రాగి రేకులేనని, వాటిని మార్చలేదని వీఎస్ఎస్సీ శాస్త్రవేత్తలు తమ నివేదికలో స్పష్టం చేశారు. తలుపుల చెక్క ఫ్రేమ్‌వర్క్ (స్థానికంగా 'కట్టిల్' అంటారు) కూడా పాతదేనని నిర్ధారించారు. దొంగిలించబడింది ఘనమైన బంగారం కాదని, రాగి రేకులపై ఉన్న బంగారు పొర మాత్రమేనని తేల్చారు. కొన్ని రేకులపై బంగారం శాతం గణనీయంగా తగ్గడాన్ని బట్టి, రసాయనాలను ఉపయోగించి బంగారాన్ని వేరు చేసి ఉంటారని అంచనా వేశారు. రేకులపై కనిపించిన మార్పుల వల్ల వాటిని పూర్తిగా మార్చేసి ఉంటారని ఇప్పటివరకు ప్రచారం జరిగింది. అయితే, బంగారం వెలికితీతకు ఉపయోగించే పాదరసం వంటి రసాయనాల ప్రయోగం వల్లే వాటి ఉపరితలంలో మార్పులు వచ్చాయని, భౌతికంగా వాటిని మార్చలేదని శాస్త్రవేత్తలు వివరించారు. ఈ వాదనతో అంతర్జాతీయ ముఠాలకు విక్రయించి ఉంటారన్న ఊహాగానాలకు తెరపడినట్లయింది.

ఈ కేసుకు సంబంధించి మరిన్ని విశ్లేషణలు కొనసాగుతున్నాయని, పాత గర్భగుడి తలుపుల నమూనాలతో పోల్చి తుది నివేదికను త్వరలోనే సమర్పిస్తామని వీఎస్ఎస్సీ అధికారులు సిట్‌కు తెలిపారు. ఈ శాస్త్రీయ ఆధారాలతో దర్యాప్తునకు స్పష్టమైన దిశానిర్దేశం లభించింది. గర్భగుడి నిర్మాణాలను మార్చకుండా, కేవలం రసాయన ప్రక్రియ ద్వారా బంగారాన్ని ఎలా దొంగిలించారు, ఈ నేరం వెనుక ఉన్నదెవరు అనే కోణంలో ఇప్పుడు విచారణ జరగనుంది.

## మున్సిపోల్స్ నామినేషన్లు షురూ

హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్ల దాఖలు ప్రారంభమైంది. తొలిరోజు దాదాపు 900 నామినేషన్లు దాఖలయ్యాయి. అయితే ఏపార్టీ కూడా ఇప్పటి వరకు తమ అభ్యర్థుల్ని ప్రకటించలేదు. ఆశావహులంతా నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. దీనికి ఇక రెండు రోజులే గడువు ఉంది. 'పుర' పోరు మొత్తం 15రోజుల్లో ముగియనుంది. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో రాజకీయ వేడి రాజుకుంది. కానీ ప్రధాన పార్టీలన్నీ ఏదో ఒక అంతర్గత సమస్యతో ఇబ్బంది పడుతూనే ఉన్నాయి. ముఖ్యంగా అధికార కాంగ్రెస్‌పార్టీకి అభ్యర్థుల ఎంపిక కత్తిమీద సాములా మారింది. ఆపార్టీని ముందుండి నడిపిస్తున్న ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీలో చదువుకోవడానికి వెళ్లారు. దావోస్ వాణిజ్య సదస్సుకు వెళ్లిన ఆయన అటునుంచి అటే అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీలో విద్యార్థిగా మారి చదువుకుంటున్నారు. పుర పోరులో నామినేషన్ల దాఖలుకు ఈనెల 30 తుది గడువు. సీఎం రేవంత్‌రెడ్డి ఫిబ్రవరి 2వ తేదీ రాష్ట్రానికి వస్తారు. ఈ దశలో అభ్యర్థుల ఎంపికపై పీసీసీ కసరత్తు చేస్తున్నది. జిల్లా ఇంచార్జి మంత్రులు ఆశావహులతో చర్చలు జరుపుతున్నారు. కీలకమైన మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో లేకపోవడం రాజకీయంగా ఆసక్తిని రేకెత్తిస్తుంది. అసెంబ్లీ ఉప ఎన్నికలు, ఎమ్మెల్సీ ఎన్నికలు, పంచాయతీ ఎన్నికల్లో బాధ్యతలు నెత్తికెత్తుకున్న ఆయన మున్సిపల్ ఎన్నికల్లో రాజకీయ దూరాన్ని ఎందుకు పాటిస్తున్నారనే విషయం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్‌పార్టీలో సీఎం రేవంత్‌రెడ్డి ఏకఛత్రాధిపత్యం పెరిగిందనే విమర్శకుల మాటలకు చెక్‌పెట్టేందుకు పురపోరులో ఆయన తన జోక్యాన్ని స్వచ్ఛందంగా తగ్గించుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ఎన్నికల్లో అధికారపార్టీకి ఆశించిన ఫలితాలు రాకుంటే రేవంత్‌రెడ్డి చరిష్మా తగ్గిందనే ప్రచారం జరిగే అవకాశాలు లేకపోలేదు. ఆయన దావోస్, అమెరికా వెళ్తూ ప్రతిపక్ష బీఆర్ఎస్‌పార్టీకి కంటిమీద కునుకు లేకుండా ప్లాన్ చేసి వెళ్లారు. అసెంబ్లీలో ఆపార్టీ ఉపనేత టీ హరీశ్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు, మాజీ ఎంపీ సంతోశ్‌రావు సహా ఒకరి తర్వాత మరొకరిని 'సిట్' విచారణకు పిలుస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీకి అదే పెద్ద టాస్క్‌గా మారింది. మున్సిపల్ ఎన్నికలపై దృష్టి సారించే పరిస్థితులు లేకుండా చేశారనే ప్రచారం జరుగుతున్నది. ఇక బీజేపీ పరిస్థితి ముందునుయ్యి, వెనుక గొయ్యి లెక్క తయారైంది. ఆపార్టీలో ఆశావహుల సంఖ్య పెరిగి, అంతర్గత కలహాలకు దారితీస్తున్నది. అనేక మున్సిపాల్టీల్లో స్థానిక ఎంపీలు జోక్యం చేసుకొని, తాము సిఫార్సు చేసిన వారికే పార్టీ టిక్కెట్ ఇవ్వాలని ప్రతిపాదనలు చేస్తున్నారు. దీనితో క్షేత్రస్థాయిలో ఆధిపత్యపోరు పీక్ స్టేజికి చేరింది. ఆపార్టీ కూడా ఇప్పటి వరకు తమ అభ్యర్థుల్ని ప్రకటించలేదు. నామినేషన్ల దాఖలుకు ఇక రెండ్రోజుల మాత్రమే గడువు ఉండటంతో అన్ని పార్టీలు హడావిడిలోనే ఉన్నాయి.

**ఆశావహుల ప్రదక్షిణాలు**

పుర పోరులో బరిలోకి దిగేందుకు ఆశావహులంతా ఆయా పార్టీల నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో తామే ఫలానా పార్టీ అభ్యర్థులమని స్వీయ ప్రచారం చేసుకుంటున్నారు. ఆయాపార్టీల అగ్రనేతలతో దిగిన ఫోటోలను పోస్ట్ చేస్తున్నారు. ఓటర్ల జాబితాలను కులాలవారీగా వర్గీకరించి విశ్లేషిస్తున్నారు. గెలుపోటములపై అంచనాలు వేస్తున్నారు. ఎన్నికల్లో ప్రభావం చూపే వ్యక్తులు, వివిధ వర్గాల ప్రతినిధులను కలుస్తూ బిజీగా గడుపుతున్నారు.

## చిన్నారులను సోషల్ మీడియాకు దూరంగా ఉంచాలి.. విధివిధానాలపై లోకేశ్ చర్చ



నిర్ణీత వయసుకు లోబడిన మైనర్లను సోషల్ మీడియాకు దూరంగా ఉంచే విషయమై విధివిధానాలను రూపొందించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. సోషల్ మీడియా జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడంపై సచివాలయంలో ఏర్పాటుచేసిన మంత్రుల బృందం సమావేశానికి మంత్రి లోకేశ్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, చిన్నారులపై సోషల్ మీడియా నిషేధం విధించే అంశంపై సింగపూర్, ఆస్ట్రేలియా, మలేషియా, ఫ్రాన్స్‌లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాల్సిందిగా సూచించారు. ఈ విషయంపై సుప్రీంకోర్టు గైడ్ లైన్స్‌ను పరిగణనలోకి తీసుకుని మార్గదర్శకాలు రూపొందించాలని అన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, మలేషియాలో మై డిజిటల్ ఐడీ, పాస్‌పోర్టు వివరాలతో ఈకేవైసీ అనుసంధానం ద్వారా 16సంవత్సరాల పైబడిన వారికి మాత్రమే సోషల్ మీడియా యాక్సెస్ ఉందని వెల్లడించారు. చిన్నారులను సోషల్ మీడియాకు దూరంగా ఉంచాలన్న విషయమై మంత్రుల బృంద సమావేశంలో ఏకాభిప్రాయం వ్యక్తమైంది. అయితే ఎంత వయోపరిమితి విధించాలనే విషయమై వివిధ దేశాల్లో చట్టాలను పరిశీలించాల్సిందిగా మంత్రుల బృందం అధికారులకు సూచించింది. మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ పోస్టు చేసే వారితో పాటు కులం, మతం, ప్రాంతం పేరుతో విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసే హెబిచ్యువల్ అఫెండర్స్‌ను కట్టడి చేసేందుకు కఠిన చర్యలు చేపట్టాలని అన్నారు. దీనిపై చర్చించేందుకు గూగుల్, మెటా, ట్విట్టర్ వంటి సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ కంప్లయన్స్ ఆఫీసర్లను కూడా వచ్చే జీవోఎం సమావేశానికి రప్పించాలని సూచించారు. సోషల్ మీడియాలో విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసేవారిపై చర్యలు తీసుకునేందుకు సెక్షన్46 ఐటీ యాక్ట్ ప్రకారం రాష్ట్రస్థాయి అడ్జుడికేటింగ్ ఆఫీసర్ నియామకంపై నోటిఫికేషన్ విడుదల చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

## వికసిత్ భారత్‌కు 2026 పునాది సంవత్సరం: రాష్ట్రపతి ముర్ము

ఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈరోజు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఢిల్లీలోని పార్లమెంట్‌లో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో కూడిన ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల 29న (గురువారం) ఆర్థిక సర్వేను, ఫిబ్రవరి 1న (ఆదివారం) కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము మాట్లాడుతూ.. గడిచిన ఏడాది వేగవంతమైన ప్రగతి, గొప్ప సాంస్కృతిక వారసత్వానికి గుర్తుగా నిలిచిపోయిందన్నారు. 'వికసిత్ భారత్' నిర్మాణంలో 2026వ సంవత్సరం ఒక కీలకమైన పునాది సంవత్సరంగా నిలుస్తుందని ఆమె అభివర్ణించారు. గత దశాబ్ద కాలంలో భారత్ అన్ని ప్రధాన రంగాలలో తన పునాదులను పటిష్ఠం చేసుకుందని, భవిష్యత్ వృద్ధికి బలమైన మార్గాన్ని నిర్మించుకుందని పేర్కొన్నారు. బంకించంద్ర ఛటర్జీ రచించిన 'వందేమాతరం' గీతం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న వేడుకలను ఆమె గుర్తుచేశారు. శ్రీ గురు తేజ్ బహదూర్ జీ 350వ షహీదీ దివస్, బిర్సా ముండా, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను ప్రస్తావించారు. దేశం తన పూర్వీకుల సేవలను గౌరవించుకున్నప్పుడు, యువతరంలో స్ఫూర్తి రగులుతుందని, అది అభివృద్ధి చెందిన భారత్ దిశగా దేశ ప్రయాణాన్ని వేగవంతం చేస్తుందని రాష్ట్రపతి తెలిపారు. కాగా, సమావేశాలకు ముందు మంగళవారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరిస్తామని నేతలు హామీ ఇచ్చారు. ఓట్ల దొంగతనం ఆరోపణలు, ఓటర్ల జాబితా సవరణ, ధాన్యం సేకరణ, ఉపాధి హామీ పథకం వంటి ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తామని కాంగ్రెస్ పార్టీ ఈ సమావేశంలో తెలిపింది.

## నిఫా ఎఫెక్ట్: ఎయిర్‌పోర్టుల్లో మళ్లీ కొవిడ్ తరహా స్క్రీనింగ్

జనవరి 28 : పశ్చిమ బెంగాల్‌లో నిఫా వైరస్ కేసులు వెలుగుచూడటంతో పలు ఆసియా దేశాలు అప్రమత్తమయ్యాయి. థాయ్‌లాండ్, నేపాల్, తైవాన్ వంటి దేశాలు తమ అంతర్జాతీయ విమానాశ్రయాల్లో కొవిడ్ తరహా ఆరోగ్య తనిఖీలను పునఃప్రారంభించాయి. అయితే, బెంగాల్‌లో పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని, ఇప్పటివరకు కేవలం రెండు కేసులే నమోదయ్యాయని భారత కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చే ప్రయాణికుల కోసం థాయ్‌లాండ్‌లోని సువర్ణభూమి, డాన్ ముయాంగ్, ఫుకెట్ విమానాశ్రయాల్లో జనవరి 25 నుంచి థర్మల్ స్క్రీనింగ్ నిర్వహిస్తున్నారు. ప్రయాణికులు ఆరోగ్య సమాచారాన్ని తెలిపే ఫారాలను నింపాల్సి ఉంటుంది. జ్వరం వంటి లక్షణాలు ఉంటే వారిని ఐసోలేషన్‌కు తరలిస్తున్నారు. ఇదే తరహా చర్యలను నేపాల్ ప్రభుత్వం ఖాట్మండు విమానాశ్రయంతో పాటు భారత్‌తో ఉన్న సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద కూడా ప్రారంభించింది. పశ్చిమ బెంగాల్‌లో డిసెంబర్ 2025 నుంచి ఇద్దరు ఆరోగ్య కార్యకర్తలకు నిఫా సోకినట్లు జనవరి 13న అధికారికంగా నిర్ధారించారు. ఈ రెండు కేసులకు సంబంధించి 196మందిని గుర్తించి పరీక్షించగా, అందరికీ నెగెటివ్ వచ్చినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ జనవరి 27న ఒక ప్రకటనలో తెలిపింది. మీడియాలో వస్తున్న అధిక సంఖ్య కేసుల వార్తలు కేవలం ఊహాగానాలేనని కొట్టిపారేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం నిఫా వైరస్ మరణాల రేటు 40 నుంచి 75 శాతం వరకు ఉండటం, దీనికి నిర్దిష్ట చికిత్స లేదా వ్యాక్సిన్ అందుబాటులో లేకపోవడంతో స్వల్ప సంఖ్యలో కేసులు నమోదైనా ఆయా దేశాలు తీవ్రంగా పరిగణిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే తైవాన్ కూడా నిఫా వైరస్‌ను అత్యంత ప్రమాదకరమైన వ్యాధుల జాబితాలో చేర్చేందుకు ప్రతిపాదనలు చేసింది.

## విమాన ప్రమాదంలో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దుర్మరణం

మహారాష్ట్ర: మహారాష్ట్రలో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ విమాన ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఆయన ప్రయాణిస్తున్న చిన్న విమానం బారామతి సమీపంలో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో అజిత్ పవార్‌తో పాటు పైలట్లు, భద్రతా సిబ్బంది సహా మొత్తం ఐదుగురు మరణించినట్లు అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన నాలుగు బహిరంగ సభల్లో పాల్గొనేందుకు అజిత్ పవార్ ఈ ఉదయం ముంబై నుంచి బారామతికి బయలుదేరారు. ఉదయం 8 గంటలకు ముంబై నుంచి టేకాఫ్ తీసుకున్న విమానం, గంట తర్వాత బారామతి ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవుతుండగా ప్రమాదానికి గురైంది. విమానంలో ప్రయాణిస్తున్న ఐదుగురూ అక్కడికక్కడే మృతి చెందినట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) వర్గాలు ధ్రువీకరించాయి. ప్రమాద స్థలంలో విమానం శకలాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. మంటలు, దట్టమైన పొగలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న వెంటనే అంబులెన్సులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఈ హఠాత్పరిణామంతో మహారాష్ట్ర రాజకీయ వర్గాలు దిగ్భ్రాంతికి గురయ్యాయి.

## మేడారం.. జనసంద్రం

మేడారం.. జనసంద్రమైంది. రెండేండ్లకోసారి జరిగే సమ్మక్క సారలమ్మ మహాజాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. వేలాది మంది సందర్శకులు పోటెత్తారు. జయజయ ధ్వానాల నడుమ, డోలు వాయిద్యాలు, ఆదివాసీ యువతుల నృత్యాలు, మహిళల పొర్లుదండాల మధ్య కాక కిరణ్ కొమ్ము ఊదుతూ ముందుకు సాగగా.. సారలమ్మను ప్రధాన వడ్డె కాక సారయ్య గద్దెలపై ప్రతిష్టించారు. బుధ వారం సాయంత్రం సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలపైకి చేరడంతో మేడారం మహాజాతరలో తొలి అంకం ముగిసింది. గురువారం సాయంత్రం సమ్మక్క రాక కోసం భక్తులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. కన్నెపల్లిలోని సారలమ్మ గుడి వద్ద ఆదివాసీ యువతులు నీటితో కడిగి ముగ్గులు వేసి ప్రత్యేక పూజలు జరిపారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర, ఐటిడిఎ పీవో చిత్రా మిశ్రా, అధికారులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ప్రధాన పూజారి కాక సారయ్య సారలమ్మను తీసుకొని వస్తుండగా, దారికి అడ్డంగా నినాదాలు చేస్తూ.. పొర్లు దండాలు చేస్తూ స్వాగతం పలికారు. సారలమ్మను తీసు కొస్తున్న వడ్డె కాక సారయ్య గద్దెలకు చేరుకోవడానికి పోలీసు అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ములుగు డీఎస్పీ రవీందర్ నాయకత్వంలో రోప్ పార్టీని ఏర్పాటు చేసి వడ్డెలు సురక్షితం గా గద్దెల వద్దకు రావడానికి కీలకంగా మారారు. ఆదివాసీ సంఘాల వాలంటీర్లు, తుడుందెబ్బ కార్యకర్తలు వడ్డెలకు రక్షణ కవచంగా నిలిచి కన్నెపల్లి నుంచి 3 కిలోమీటర్ల దూరంలోని మేడారం గద్దెల వరకు ముందుకు సాగారు. ప్రధాన పూజారి కాక సారయ్య, ఇతర పూజారులు సారలమ్మను గద్దెపైకి ప్రతిష్టించిన అనంతరం మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర, అధికారులు పూజలు నిర్వహించారు.

**కొలువుతీరిన పగిడిద్దరాజు**

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం పూనుగొండ్ల నుంచి పెనక వంశీయులు సమ్మక్క భర్త పగిడిద్దరాజును గద్దెపై ప్రతిష్టించారు. మంగళవారమే పూనుగొండ్ల నుంచి పెనక వంశీయులు పగిడె రూపంలో వున్న పగిడిద్దరాజును తీసుకొని కాలినడకన బయలుదేరి రాత్రి గోవిందరావుపేట మండలంలోని లక్ష్మీపురంలో బస చేశారు. బుధవారం మళ్లీ కాలినడకన బయలుదేరి సాయంత్రానికి మేడారం గద్దెలకు చేరుకొని పడిగె రూపంలో వున్న పగిడిద్దరాజును ప్రతిష్టింపజేశారు.

**గోవిందరాజుల ప్రతిష్ట**

ములుగు జిల్లాలోని ఏటూర్‌నాగారం మండలం కొండాయి నుంచి ప్రధాన వడ్డె పోదెం బాబురావు, ఇతర పూజారులు పడిగె రూపంలోని గోవిందరాజును తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్టించారు.

**నేడు సమ్మక్క రాక**

సారలమ్మ గద్దెలపై కొలువుతీరడంతో మేడారం జాతర ప్రారంభం కాగా, గురువారం సాయంత్రం చిలుకలగుట్ట నుంచి సమ్మక్కను ప్రధాన పూజారి కొక్కెర కిష్టయ్య తీసుకురానున్నారు. ఇందుకు అధికార యంత్రాంగం, సమ్మక్క పూజారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# పాఠశాలల్లో సామాజిక కార్యక్రమాలు అభినందనీయం

* కొలను హనుమంత రెడ్డి
* విజ్ఞాన్ సుధా పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం







(ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్) : సామాజిక సేవా కార్యక్రమాలలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం ముందు ఉండడం అభినందనీయమని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంత రెడ్డి అన్నారు. లైన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ ఆధ్వర్యంలో మల్లారెడ్డి ఆసుపత్రి సౌజన్యంతో చింతల్ లోని విజ్ఞాన్ సుదా హైస్కూల్లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఎందరికో ఉపయోగపడుతున్నాయన్నారు. మునుముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైసింగ్ తెలంగాణ పేరుతో భారతదేశంలోనే రాష్ట్రాన్ని నెంబర్ వన్ గా తీసుకెళ్తుంది అన్నారు. విద్యార్థులకు ఉత్తమైన భవిష్యత్తు ఇచ్చే విధంగా విద్యా విధానం రూపొందుతుందని తెలిపారు. ఈసందర్భంగా సుమారు 500 మంది వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు. సాధారణ, కంటి, దంత, గుండె, స్త్రీ సంబంధిత వైద్యులు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రామేశ్వర్ రెడ్డి, లయన్స్ క్లబ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షులు బిరు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి దయాకర్, విజ్ఞాన సుధా పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్ సుధా, లయన్స్ క్లబ్ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, వినోద్ జాదవ్, గడ్డమీది బాలరాజు, సి హెచ్ నరసింహులు గౌడ్, భాష, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రావణ్ కుమార్, లక్ష్మారెడ్డి, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దాం



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నాలుగు కొత్త లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసఫ్ ఆరోపించారు. బుధవారం కొత్తగూడెం శేషగిరిభవన్‌లో జాతీయ కార్మిక సంఘాలైన ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, టీయూసీఐ, బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. తక్షణమే లేబర్ కోడ్‌లను రద్దు చేసి పాత కార్మిక 29 చట్టాలను కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటీ ప్రసాద్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు జలీల్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్, టీయూసీఐ జిల్లా అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జె సీతారామయ్య, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు తదితరులు మాట్లాడారు. కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో నాగభూషణం, జి నగేష్, గోనె మని, వంగ వెంకట్, భాస్కర్, ఎండూరి ప్రభావతి, కే బ్రహ్మచారి, భూక్యా రమేష్, జి పద్మ, నూపా భాస్కర్, సంజీవ్, డీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లా మున్సిపాలిటీల ఎన్నికల పరిశీలకుల నియామకం



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఆలియాబాదు, మూడుచింతలపల్లి, ఎల్లంపేట్ మున్సిపాలిటీలకు ఎన్నికల సాధారణ పరిశీలకులుగా కొర్ర లక్ష్మి ఐఎఎస్, వ్యయ పరిశీలకులుగా సునయన చౌహాన్లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తో కలిసి సాధారణ ఎన్నికల పరిశీలకులు కొర్ర లక్ష్మి ఆలియాబాదు మున్సిపాలిటిలోని పోలింగ్ బూతులను పరిశీలించారు. ఆవరణలో కావలసిన మౌలిక సదుపాయాలను, రేలింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మున్సిపాలిటీలలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. అంతకు ముందు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కు వచ్చిన సాధారణ ఎన్నికల పరిశీలకులు కొర్రలక్ష్మిని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి పూల మొక్క అందంచి ఆహ్వానం పలికా.

## ప్రజల్లో స్ఫూర్తి నింపడమే ప్రజాస్ఫూర్తి లక్ష్యం

* ప్రజాస్ఫూర్తి క్యాలెండర్ ఆవిష్కరణ



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: వార్త కథనాల ద్వారా ప్రజలలో స్ఫూర్తి నింపడమే లక్ష్యంగా ప్రజాస్ఫూర్తి దినపత్రిక పనిచేస్తుందని ధర్మోజిగూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా అన్నారు. చౌటుప్పల్ మండలం ధర్మోజీ గూడెం గ్రామపంచాయతీ ఆవరణలో ప్రజాస్ఫూర్తి దినపత్రిక ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్లను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జువ్వి నర్సింహ్మా మాట్లాడుతూ ప్రజలకు నిష్పక్షపాతంగా సమగ్ర సమాచారాన్ని అందజేయడమే లక్ష్యంగా ప్రజాస్ఫూర్తి దినపత్రిక పనిచేస్తుందన్నారు. వార్త కథనాలతో ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావాలని సూచించారు. సమస్యలను పరిష్కరించడంలో ప్రజాస్ఫూర్తి దినపత్రిక తనదైన ముద్రను చాటుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బత్తుల శ్రీహరి, పిసాటి బాల్ రెడ్డి, ఊదరి నర్సింహ్మా, కొంతం శ్రీనివాస్ రెడ్డి, జంగం అంజయ్య, ఊదరి రవి, వంగూరి సురేష్, జక్కల శ్రీశైలం, ఏషగోని మణిశంకర్, సామిడి ప్రవీణ్ రెడ్డి, చెరుకు అంజయ్య, దాసరి లింగయ్య, ప్రజాస్ఫూర్తి దినపత్రిక రిపోర్టర్ స్వామినాథం తదితరులు పాల్గొన్నారు.



# అవినీతి రహితమే ప్రభుత్వ విధానం

: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

పటాన్‌చెరు, ప్రజాస్ఫూర్తి: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖను పూర్తిగా పారదర్శకంగా, అవినీతి రహితంగా ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక సంస్కరణలు అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ & సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పటాన్‌చెరు మండలం కర్ధనూర్ గ్రామంలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల కాంప్లెక్స్‌కు మంత్రి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజలకు సౌకర్యవంతంగా, అత్యాధునిక వసతులతో కార్పొరేట్ స్థాయి ప్రమాణాల్లో రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా సమీకృత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. మొదటి విడతలో ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని 39 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 క్లస్టర్లుగా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అందులో భాగంగానే సంగారెడ్డి జిల్లా కర్ధనూర్‌లో శంకుస్థాపన చేశామని తెలిపారు. సుమారు మూడు ఎకరాల విస్తీర్ణంలో, 20 వేల చదరపు అడుగులలో ఈ భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. కనీసం ఐదేళ్ల పాటు భవనాల నిర్వహణ బాధ్యత కూడా నిర్మాణ సంస్థలదే ఉండేలా నిబంధనలు రూపొందించినట్లు స్పష్టం చేశారు. సమీకృత కార్యాలయాల్లో పెళ్లి రిజిస్ట్రేషన్‌కు వచ్చే జంటలు, చిన్న పిల్లలతో వచ్చే తల్లులు, దివ్యాంగులు, వృద్ధులు, పేద ప్రజలకు అనుకూలంగా ఫైవ్‌స్టార్ స్థాయి వసతులు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్రంలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఇదే విధానంలో భవనాలు నిర్మించనున్నట్లు వెల్లడించారు.

ఈ సందర్భంగా మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, పటాన్‌చెరు తెలంగాణ రాష్ట్రానికి పారిశ్రామిక హబ్‌గా మారిందని చెప్పారు. 'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. భూ సమస్యలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. రిజిస్ట్రేషన్లు & స్టాంప్స్ శాఖ కమిషనర్ రాజీవగాంధీ హనుమంతు మాట్లాడుతూ, రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా రాష్ట్రానికి ఏటా సుమారు రూ.14,500 కోట్ల ఆదాయం సమకూరుతోందని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 144 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తున్నాయని, ప్రజల సౌకర్యార్థం సమీకృత కార్యాలయాలు నిర్మిస్తున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్‌రెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫయీమ్, జిల్లా రిజిస్ట్రార్, సబ్‌రిజిస్ట్రార్లు, రెవెన్యూ అధికారులు, రాజ్ పుష్ప ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, డాక్యుమెంట్ రైటర్లు, ప్రజలు పాల్గొన్నారు.




# ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు

అందోలు, ప్రజాస్ఫూర్తి: ఉచిత వైద్య శిబిరాలతో గ్రామీణ ప్రాంత పేదలకు ఉచిత వైద్యం అందజేయడమే లక్ష్యమని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, సర్పంచ్ సునీత మహిపాల్ అన్నారు. బుధవారం అందోలు మండలంలోని కన్ సాన్ పల్లి గ్రామంలో సర్పంచ్ సునీత మహిపాల్ ఆధ్వర్యంలో సురక్ష పిల్లల ఆసుపత్రి జోగిపేట సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నీలోఫర్ ఆసుపత్రి ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు విద్యాసాగర్ పాల్గొని చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి పోషకాహార లోపం ఉన్న పిల్లలకు ఉచితంగా మందులను పంపిణి చేశారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గ్రామంలో మొదటిసారిగా చిన్నపిల్లల కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం పట్ల గ్రామస్తుల నుంచి భారీ స్పందన వచ్చింది. ఉదయం 9 గంటల నుండి వైద్య శిబిరం వద్ద బారులు తీరారు. సుమారుగా 200 మంది పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లలేని పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకే ఉచిత వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉచిత వైద్య శిభిరం వల్ల పేదలకు ఆర్థిక భారం తగ్గి, ఆరోగ్య సంరక్షణపై అవగాహన పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సురేష్ రావు, మొరబోయిన కృష్ణ, మాజీ ఎంపిటిసి బాలయ్య, ఉప సర్పంచ్ పెంటయ్య, వార్డు సభ్యులు తెలుగు మహిపాల్, వని మోహన్, యువ నాయకులు జోగాల గోవర్ధన్, తాళ్ల మణికంఠ, బుసనెల్లి ఆంజనేయులు, దేవునూరి ప్రభు, కమ్మరి వెంకటేశం, పుట్ల రమేష్ తో పాటు వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముహమ్మద్ ప్రవక్త పై కవితా గానం

* పోలయ్య కవి కూకట్లపల్లికి ఘనసన్మానం



(హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి): ఇదార అదాబ్ ఇస్లామీ హింద్ తెలంగాణ సంస్థ ఆధ్వర్యంలో ఇస్లామీయా సాహిత్య వేదిక ఆవిర్భావ సభ రవీంద్ర భారతిలో నిర్వహించారు. అబు నబీల్ ఖాజా మసిహుద్దీన్ అధ్యక్షతన 63 మంది కవులు రాసిన "ప్రవక్త ముహమ్మద్ జీవిత విశేషాలు" కవితా సంపుటి ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన కవి సమ్మేళనంలో ప్రముఖ కవి రచయిత నటుడు పోలయ్య కవి కూకట్లపల్లి పాల్గొని "మహా సంఘ సంస్కర్త ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం" శీర్షికతో కవితాగానం చేసి ప్రముఖ సాహితీమూర్తుల ప్రశంసలు అందుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శాంతి కృష్ణ, నాళేశ్వరం శంకరం టి.గౌరీశంకర్, ఆలపాటి తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం 56వ డివిజన్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి నామినేషన్ దాఖలు



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో బుధవారం నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. మొత్తం 60 డివిజన్లకు గాను తొలి రోజు నామినేషన్ల స్వీకరణ జరిగింది. ఈ సందర్భంగా 56వ డివిజన్ నుంచి బీఆర్ఎస్ పార్టీ తరపున బండారి రజిత రిటర్నింగ్ అధికారికి (ఆర్ఓ) నామినేషన్ పత్రాలు సమర్పించారు. మాజీ కౌన్సిలర్ రుక్మంగాధర్ బండారి, గోపు రామకృష్ణ, వెలగల వాసు, సృజన తదితరులు పాల్గొని బండారి రజితకు మద్దతు తెలిపారు.

కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులను గెలిపించండి


## సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక మంచి కంటి భవన్లో జరిగిన జిల్లా కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన కొత్తగూడెం కార్పొరేషన్ జరుగుతున్న ఎన్నికల్లో సిపిఎం రెండు డివిజన్లలో కాంగ్రెస్ మద్దతుతో పోటీ చేస్తుందని తెలిపారు. ఎన్నికల్లో అనేక మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నప్పటికీ ప్రశ్నించే గొంతుకులను పాలకమండలిలో ఉంచాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని ఆయన గుర్తు చేశారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చే సిపిఎం అభ్యర్థులను గెలిపించడం ద్వారా వాటి పరిష్కారానికి మరింత పోరాటం చేయడానికి అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య ఏజే రమేష్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ లిక్కి బాలరాజు జిల్లా కమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్ కున్సోత్ ధర్మ జిలకర పద్మ వీర్ల రమేష్ భూక్యా రమేష్ పాల్వంచ టౌన్ కార్యదర్శి తులసీరామ్ నాయకులు కే సత్య జునుమాల నగేష్ గండమాల భాస్కర్ బచ్చలకూర శ్రీను గూని నాగచందర్ ఆలేటి శ్రీను నిరంజన్ మాధవి కుమారి నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జోగిపేట 11వ వార్డు కౌన్సిలర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా బీర్ల లతశంకర్

అందోలు, ప్రజాస్ఫూర్తి: అందోల్ జోగిపేట మున్సిపల్ 11వ వార్డులో బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా తనను అభ్యర్థిగా ఖరారు చేసినట్లు బీర్ల లతాశంకర్ తెలిపారు. అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆశీస్సులతో 11వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానన్నారు. వార్డు నుంచి బిర్లా లతా శంకర్, ఎర్రగొల్ల జానాబాయి మహేష్ యాదవ్ లు టికెట్ ఆశించగా ఇద్దరి మధ్యన టికెట్ ఎవరికి వస్తుందో అని వార్డు ప్రజలు ఉత్కంఠ గా ఎదురు చూశారు. చివరకు బిఆర్ఎస్ అధిష్టానం ఉత్కంఠకు తెర దించింది. పార్టీ చేసిన సర్వే ప్రకారం బిర్లా లతా శంకర్ అభ్యర్థిత్వాన్ని మొగ్గుచూపుతో వారికి టికెట్ కేటాయించింది. ఈ సందర్భంగా వారు



మాట్లాడుతూ తమపై నమ్మకంతో టికెట్ ఇచ్చినందుకు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ తోపాటు బిఆర్ఎస్ పార్టీ నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. 11వ వార్డులో బి ఆర్ఎస్ జెండా ఎగరవేస్తామని వారు ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు సమిష్టిగా ఐక్యమత్యంతో పనిచేసే కాంగ్రెస్ పార్టీని ఓడిస్తామని వారు స్పష్టం చేశారు.



# భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొదలైన మున్సిపల్ ఎన్నికల నామినేషన్లు

ప్రజాస్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల దాఖలు ప్రక్రియ కొనసాగుతున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అశ్వరావుపేట మున్సిపాలిటీ, ఇల్లందు మున్సిపాలిటీ, కొత్తగూడెం కార్పొరేషన్ ఉండగా, వాటిలో 106 వార్డులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అశ్వారావుపేట మున్సిపాలిటీలోని 22 వార్డులకు గాను ఇప్పటివరకు 3 నామినేషన్లు దాఖలయ్యాయని తెలిపారు. వీటిలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) - 2, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) - 1 నామినేషన్లు ఉన్నట్లు వెల్లడించారు. ఇల్లందు మున్సిపాలిటీలోని 24 వార్డులకు గాను ఇప్పటివరకు 1 నామినేషన్ దాఖలైందని, ఈ నామినేషన్ బీజేపీ తరఫున నమోదైనట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లోని 60 వార్డులకు గాను ఇప్పటివరకు 3 నామినేషన్లు దాఖలయ్యాయని, వీటిలో బీఆర్ఎస్ - 2, స్వతంత్ర అభ్యర్థి - 1 నామినేషన్ ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. మొత్తంగా జిల్లాలో ఇప్పటివరకు 7 నామినేషన్లు దాఖలయ్యాయని, వీటిలో బీజేపీ - 3, బీఆర్ఎస్ - 3, స్వతంత్ర అభ్యర్థులు - 1 కాగా, ఇతర రాజకీయ పార్టీల నుంచి ఇప్పటివరకు ఎటువంటి నామినేషన్లు దాఖలుకాలేదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ జనవరి 30, 2026 సాయంత్రం 5.00 గంటల వరకు కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. అర్హులైన అభ్యర్థులు నిర్ణీత గడువు లోపు అవసరమైన పత్రాలతో నామినేషన్లు దాఖలు చేయాలని, రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు.

# మహాపాపం చేసి కూడా బుకాయించుకోవడం జగన్‌కే చెల్లింది: మంత్రి లోకేశ్



అమరావతి: తిరుమల లడ్డూ విషయంలో మహాపాపం చేసి కూడా బుకాయించుకోవడం వైకాపా అధినేత జగన్‌కే చెల్లిందని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. కల్తీ జరిగిందని నిర్ధరణ అయ్యాక కూడా నివేదికను వక్రీకరిస్తూ తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. "పాలే లేని కల్తీ నెయ్యి సృష్టించి దేవుడి ప్రసాదాన్ని అపవిత్రం చేయడం క్షమించరాని నేరం. వందల కోట్ల కుంభకోణానికి పాల్పడటమే కాకుండా అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. వైకాపా కుట్రలను దీటుగా తిప్పికొట్టడంతోపాటు వారి వ్యవహారాన్ని ప్రజల్లోనే ఎండగడదాం'' అని లోకేశ్ అన్నారు.

# సార్ ప్లీజ్.. మీరిద్దరూ కలిసి విమాన ప్రయాణాలు చేయకండి

*** అభిమానుల విజ్ఞప్తి**



మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ విమాన ప్రమాదంలో దుర్మరణం చెందడంతో ఆయన అభిమానులు తీరని శోకసంద్రంలో మునిగిపోయారు. బారామతి ప్రభుత్వ ఆస్పత్రి వద్ద కడసారి చూపు కోసం క్యూ కట్టారు. అజిత్ పవార్ మరణం నేపథ్యంలో ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ లకు అభిమానులు స్పెషల్ రిక్వెస్ట్ చేస్తున్నారు. విమాన ప్రమాదాల్లో రాజకీయ నేతలు మరణిస్తుండటంతో.. దయచేసి మీరిద్దరూ కలిసి విమానాల్లో ప్రయాణించడం మానుకోండి. ఇది మీ సేఫ్టీ కోసమే చెప్తున్నాం. మీకేదైనా జరగరానిది జరిగితే మేం తట్టుకోలేం. దయ చేసి మా అభ్యర్థనను అర్థం చేసుకోండి అంటూ నెట్టింట వీడియోలు పోస్టు చేస్తున్నారు. వాటిపై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. కొందరు ఈ రిక్వెస్ట్‌ను ఫాలో అవ్వండని కోరుతుండగా.. మరికొందరు మాత్రం వాళ్లకు ఏమీ కాకూడదని కోరుకోవాలని కానీ.. ఇలాంటి పోస్టులు పెట్టడం ఏంటని మండిపడుతున్నారు.


## 'వైకాపా మాజీ ఎంపీ

# నందిగం సురేశ్ దంపతులతో ప్రాణహాని'



గుంటూరు: వైకాపాకు చెందిన మాజీ ఎంపీ నందిగం సురేశ్ దంపతులతో ప్రాణహాని ఉందంటూ ఉద్ధండరాయునిపాలేనికి చెందిన ప్రాతూరి జగదీశ్ అనే వ్యక్తి ఆరోపించారు. తనతో పాటు తన కుటుంబానికి ప్రమాదం పొంచి ఉందంటూ సెల్ఫీ వీడియో విడుదల చేశారు. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన డబ్బు తిరిగివ్వాలని అడిగినందుకు సురేశ్ వేధిస్తున్నారన్నారు. అతడి అనుచరులు కార్లతో వెంబడిస్తూ భౌతికదాడులకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తాను చనిపోతే దీన్ని మరణ వాంగ్మూలంగా భావించాలని జగదీశ్ పేర్కొన్నారు.

# విమానయాన రంగం అద్భుతమైన వృద్ధిని సాధిస్తోంది



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశ విమానయాన రంగం అద్భుతమైన వృద్ధిని సాధిస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం వేదికగా జరుగుతున్న ఆసియాలోనే అతిపెద్ద విమానయాన ప్రదర్శన వింగ్స్ ఇండియా 2026ను కేంద్రమంత్రి బుధవారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశీయ విమానయాన రంగం ప్రగతి పథంలో ముందుకు సాగుతోందన్నారు. దాన్ని ప్రపంచానికి చాటి చెప్పేందుకు వింగ్స్ ఇండియా ప్రదర్శన గొప్ప వేదికగా నిలుస్తుందన్నారు. "ఇండియన్ ఏవియేషన్: పేవింగ్ ద ఫ్యూచర్ ఫ్రమ్ డిజైన్ టు డిప్లాయ్‌మెంట్, మాన్యుఫ్యాక్చరింగ్ టు మెయింటెనెన్స్, ఇంక్లూసివిటీ టు ఇన్నోవేషన్, అండ్ సేఫ్టీ టు సస్టైనబిలిటీ" అనే ఇతివృత్తంతో జరుగుతున్న ఈ వేడుక దేశాన్ని అంతర్జాతీయ ఏవియేషన్ హబ్‌గా మార్చే దిశగా కీలక అడుగు అని ఆయన స్పష్టం చేశారు. నాలుగు రోజుల పాటు కొనసాగే ఈ మెగా ఈవెంట్‌లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశ్రమల దిగ్గజాలు, ఆవిష్కర్తలు, వివిధ దేశాల ప్రతినిధులు భాగస్వాములయ్యారు. ఈ ప్రదర్శనలో భాగంగా అత్యాధునిక విమానాల ప్రదర్శనలు, విమాన తయారీ రంగంలో భారత్ సాధించిన ప్రగతి, భవిష్యత్తు భాగస్వామ్యాల గురించి చర్చించనున్నారు. ముఖ్యంగా విమానాల నిర్వహణ, సుస్థిర విమానయాన ఇంధనం, డ్రోన్ సాంకేతికత వంటి కీలక అంశాలపై ఈ సదస్సు దృష్టి సారించనుంది. దేశీయంగా తయారీ రంగాన్ని బలోపేతం చేస్తూనే, పౌర విమానయాన రంగాన్ని సామాన్యులకు మరింత చేరువ చేయడమే లక్ష్యమని కేంద్రమంత్రి అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా భారతదేశం తన సత్తాను గ్లోబల్ మార్కెట్‌లో చాటుతోందని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

## రైల్వేకోడూరు ఎమ్మెల్యేపై ఆరోపణలు..

# జనసేన కీలక నిర్ణయం

అమరావతి: రైల్వేకోడూరు ఎమ్మెల్యే అంశంలో జనసేన పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పై ఓ మహిళ ఆరోపణలు చేసిన నేపథ్యంలో విచారణకు ముగ్గురు సభ్యులతో కమిటీని నియమించింది. దీనిలో టి.శివశంకర్, తంబళ్లపల్లి రమాదేవి, టి.సి.వరుణ్ ఉన్నారు. ప్రసార మాధ్యమాల్లో వచ్చిన వార్తలపై విచారణ చేయాలని కమిటీని పార్టీ ఆదేశించింది. ఈ కమిటీ ముందు ఏడు రోజుల్లోపు ఎమ్మెల్యే శ్రీధర్ హాజరై వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. కమిటీ నివేదిక వెల్లడయ్యే వరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యేను ఆదేశించింది.

## ఇండియా, న్యూజిలాండ్ మధ్య మ్యాచ్..

# విశాఖ స్టేడియం వద్ద పలువురి అరెస్ట్




టీమిండియా, న్యూజిలాండ్ టీ ట్వంటీ మ్యాచ్ ఈ సాయంత్రం 7 గంటలకు విశాఖ స్టేడియం లో ప్రారంభంకానుంది. ఇప్పటికే ప్లేయర్లందరూ స్టేడియంకు చేరుకున్నారు. ప్రేక్షకులు ఇప్పుడిప్పుడే స్టేడియం వద్దకు చేరుకుంటున్నారు. మరోవైపు స్టేడియం వద్ద బ్లాక్ టికెట్ల దందా కొనసాగుతోంది. టీ ట్వంటీ మ్యాచ్‌కు సంబంధించి ఆన్ లైన్‌లో టికెట్లు కొనుగోలు చేసి కొందరు విశాఖ స్టేడియం వద్ద బ్లాక్‌లో టికెట్లు అమ్ముతున్నారు. రూ. 1200 టికెట్ ను రెట్టింపు ధరకు రూ. 2500కు రూ. 3000 టికెట్ ను రూ. 4 వేలకు అమ్ముతున్నారు. దీంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు పలువురిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. నిందితుల నుంచి 20 టికెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనతో బ్లాక్ టికెట్ల దందాపై పోలీసులు మరింత నిఘా పెట్టారు. బృందాలుగా విడిపోయి నగరంలో జల్లెడపడుతున్నారు.

**నాలుగో టీట్వంటీ మ్యాచ్**

కాగా న్యూజిలాండ్‌భారత్ మధ్య ఐదు టీట్వంటీల సిరీస్ కోసం విశాఖలో నాలుగో మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే మూడు మ్యాచ్‌లు గెలిచి నాలుగో విజయం కూడా నమోదు చేయాలని టీమిండియా ఉత్సాహంగా ఉంది. ఈ నేపథ్యంలో విశాఖ బ్లాక్ టికెట్ల దందా వెలుగులోకి వచ్చింది. ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు ప్రేక్షకులు ఆన్ లైన్ లో టికెట్ల కొనుగోలు చేసేందుకు ప్రయత్నం చేశారు. అయితే కొందరికి టికెట్ల దొరకలేదు. దీంతో విశాఖ స్టేడియం వద్ద బ్లాక్ లో టికెట్లు కొనేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఈ మేరకు టాస్క్ ఫోర్స్ పటిష్ట నిఘా పెట్టి బ్లాకులో టికెట్లు కొనుగోలు చేస్తున్న, అమ్మిన వారిని అదుపులోకి తీసుకుంటోంది.

## కర్నూలులో విద్యుత్ స్తంభం కూలిన ఘటన..

# గుత్తేదారుపై క్రిమినల్ కేసు



కర్నూలు: కర్నూలు నగరంలో విద్యుత్ స్తంభం కూలిన ఘటనలో గుత్తేదారుపై క్రిమినల్ కేసు నమోదైంది. ఈ నెల 27న అశోక్‌నగర్‌లో డ్రైనేజ్ పనులు జరుగుతుండగా విద్యుత్ స్తంభం కూలిపోయింది. అదే సమయంలో అటుగా నడుచుకుంటూ వెళ్తున్న బాలుడు త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఆ దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదు కాగా.. సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి.. గుత్తేదారుపై కేసు నమోదు చేయాలని, బ్లాక్‌లిస్టులో పెట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కర్నూలు టూటౌన్ పోలీసులు గుత్తేదారుపై క్రిమినల్ కేసు నమోదు చేశారు.

# 24 గంటల పరుగుపందెంలో వినుకొండవాసి విజయం




న్యూఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం లో జరిగిన 24 గంటల జాతీయస్థాయి పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన వినుకొండ వాసి, జాతీయ క్రీడాకారుడు షేక్ అబ్దుల్లా విజయం సాధించారు. ఈనెల 24వ తేదీన ఉదయం 7 గంటలకు మొదలై మరుసటి రోజు 25న ఉదయం 7 వరకు జరిగిన 24 గంటల పరుగు పందెం దిగ్విజయంగా పూర్తి చేసి మెడల్ సాధించారు. ఇదే ఏడాది జూన్ 13న బెంగళూరు కాంతిలాల్ స్టేడియంలో జరగబోయే 24 గంటల పరుగు పందెంలో పాల్గొననున్నారు. 225 కిలోమీటర్ల అర్హత సాధించి త్వరలో జపాన్ లో కూడా జరగబోయే 24 గంటల ప్రపంచ ఛాంపియన్ షిప్ కోసం మన దేశం నుంచి క్వాలిఫై రేస్ లో ఉన్నారు. ఈ క్రమంలో అబ్దుల్లాను పట్టణంలోని యస్.బి.జె జ్యూయలరీ మార్ట్ ఎన్నార్టీ బాజీ, జూనియర్ కాలేజ్ కరిముల్లా మాస్టర్, జూనియర్ కాలేజ్ తోట నరసింహారావు, లాయర్ సతినేని మహేష్ ప్రత్యేకంగా అభినందించారు. తమవంతుగా కొంత ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదేవిధంగా పట్టణంలోని క్రీడాకారులు, ప్రముఖులు, మిత్రులు అబ్దుల్లాను అభినందించారు.

# సూళ్లూరుపేట, నాయుడుపేట ప్రజలకు గుడ్ న్యూస్


దక్షిణ మధ్య రైల్వే ఇటీవల ప్రారంభించిన అమృత్ భారత్ సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్‌కు సూళ్లూరుపేట, నాయుడుపేట పట్టణాల పరిధిలో ఉన్న రైల్వే స్టేషన్‌లలో నిలిచేందుకు రైల్వే శాఖ ఆదేశాలు విడుదల చేసింది. ప్రతి బుధవారం తమిళనాడు రాష్ట్రంలోని తిరుచునాపల్లి నుండి బయలుదేరి వెస్ట్ బెంగాల్‌లోని జల్పాయ్ గురి ప్రాంతానికి వెళుతుంది. తిరుచినాపల్లి నుండి బయలుదేరిన ఈ రైలు ప్రతి బుధవారం మధ్యాహ్నం 3:30 నిమిషాలకు సూళ్లూరుపేటకు చేరుకుంటుంది. అదేవిధంగా నాయుడుపేట రైల్వే స్టేషన్ కు 3:58 నిమిషాలకు చేరుతుందని స్థానిక రైల్వే అధికారుల సమాచారం. అమృత్ భారత్ రైలుకు చిన్న పట్టణాలలో నిలిచేందుకు అవకాశం కల్పించిన రైల్వే శాఖ అధికారులకు సూళ్లూరుపేట, నాయుడుపేట పట్టణ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# హైదరాబాద్‌లో ఆకట్టుకున్న లోహ విహంగ విన్యాసాలు

హైదరాబాద్: బేగంపేట విమానాశ్రయంలో వింగ్స్ ఇండియా ప్రదర్శన ప్రారంభమైంది. ఈ ప్రదర్శనను పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. పౌరవిమానయాన శాఖ, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో దీన్ని నిర్వహిస్తున్నారు. ఈనెల 31 వరకు ఇది కొనసాగనుంది. వివిధ దేశాలు, సంస్థలకు చెందిన విభిన్న రకాల విమానాలు, హెలికాప్టర్లు, పోర్టబుల్ ఫ్లైయిట్లు, వాణిజ్య విమానాలు వైమానిక ప్రదర్శనలో చేస్తున్న విన్యాసాలు ఆకట్టుకుంటున్నాయి. ఆ చిత్రాలు..
















## మున్సిపల్ ఎన్నికల ప్రచారం..
# రాష్ట్రానికి భాజపా జాతీయ నేతలు

**: రామచందర్‌రావు**



హైదరాబాద్: మరికొన్ని రోజుల్లో తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రచారం కోసం భాజపా జాతీయ నేతలు రానున్నట్లు ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు తెలిపారు. పది రోజుల్లో రెండు భారీ బహిరంగ సభలకు ప్లాన్ చేస్తున్నట్లు మీడియాతో నిర్వహించిన చిట్ చాట్‌లో చెప్పారు. ఉత్తర తెలంగాణలో ఒక సభ, దక్షిణ తెలంగాణలో మరొ సభ నిర్వహిస్తామని.. వీటికి పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హా, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రానున్నట్లు వెల్లడించారు. అంతకుముందు భాజపా రాష్ట్ర కార్యాలయంలో పలువురు న్యాయవాదులు రామచందర్‌రావు సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తెలంగాణ భాజపా చీఫ్ మాట్లాడుతూ.. బ్రిటీష్ చట్టాలే ఇప్పటి వరకు అయ్యాయని, మోదీ వాటికి చరమగీతం పాడేలా న్యాయ వ్యవస్థలో మార్పులు తెచ్చారని చెప్పారు. బంగారు తెలంగాణ కావాలంటే మేధావి వర్గం అంతా భాజపాలో చేరాలని పిలుపునిచ్చారు. అవినీతి రహిత పాలన అందాలంటే రాష్ట్రంలో భాజపా ప్రభుత్వం రావాల్సిందేనని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో భాజపా అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# నయీం కేసులో ఈడీ ఛార్జిషీట్ దాఖలు

హైదరాబాద్: గ్యాంగ్‌స్టర్ నయీం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఛార్జిషీట్ దాఖలు చేసింది. గ్యాంగ్‌స్టర్ నయీం తన కుటుంబ సభ్యులు, అనుచరులతో కలిసి పలువురి ఆస్తులను బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు గుర్తించిన ఈడీ.. రంగారెడ్డి జిల్లా కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసింది. గతంలో తెలంగాణ పోలీసులు నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. ఈ వ్యవహారంలో పాశం శ్రీనివాస్, హసీనాబేగం, మహ్మద్ తాహెరా బేగం, సలీమ బేగం, అబ్దుల్ సలీం, అహెలా బేగం, సయ్యద్ నీలోఫర్, అంజుమ్, ఆరిఫ్, హీనాలను నిందితులుగా చేర్చింది. మొదట ఆస్తులను గుర్తించి, తర్వాత యజమానులను బెదిరించి నయీం తన అనుచరులు, కుటుంబ సభ్యుల పేర్లపై బదిలీ చేయాలని ఒత్తిడి



తెచ్చేవారని ఈడీ పేర్కొంది. యజమానులు అంగీకరించకపోతే వారిని లేదంటే.. వారి కుటుంబ సభ్యులను అపహరించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు తీసుకెళ్లి బలవంతంగా రిజిస్ట్రేషన్లు చేయించేవారని తెలిపింది. దీని ద్వారా అక్రమంగా సంపాదించిన ఆస్తులను చట్టబద్ధమైనవిగా చూపించినట్టు వెల్లడైంది. అయితే ఆస్తులు విక్రయించిన యజమానులకు ఏ విధమైన నగదు ప్రతిఫలం అందలేదని ఈడీ పేర్కొంది. బెదిరింపుల కారణంగా బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి ధైర్యం చేయలేకపోయారని ఈడీ తెలిపింది. దర్యాప్తులో మొత్తం 91 ఆస్తులు గ్యాంగ్‌స్టర్ నయీం కుటుంబ సభ్యులు, అనుచరుల పేర్లపై బలవంతంగా రిజిస్ట్రేషన్ చేసినట్టు తేలిందని పేర్కొంది. నయీంకు అత్యంత సన్నిహిత అనుచరుడిగా ఉన్న పాశం శ్రీనివాస్ ఆస్తులు లాక్కోవడంలో ముఖ్యపాత్ర పోషించినట్టు ఈడీ గుర్తించింది. అయితే, ఈ ఆస్తులన్నీ ఇప్పటికే బినామీ ఆస్తుల నిషేధ చట్టం, 1988 కింద ఆదాయపన్ను శాఖ ద్వారా జప్తు కావడంతో ఈడీ వాటిని వేరుగా జప్తు చేయలేదని, ఆ ఆస్తులను కేంద్ర ప్రభుత్వానికి స్వాధీనం చేయాలని ఛార్జిషీట్‌లో ఈడీ పేర్కొంది.

# ఫిబ్రవరి 3 నుంచి సీఎం రేవంత్ ఎన్నికల ప్రచారం



హైదరాబాద్: తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చేసింది. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారం కోసం ఫిబ్రవరి 3 నుంచి రాష్ట్రంలో పర్యటించనున్నారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న ఆయన.. నెలాఖరుకు స్వదేశానికి తిరిగి వస్తారు. ఫిబ్రవరి 3న నల్గొండ జిల్లా మిర్యాల గూడ, 4న కరీంనగర్ జిల్లా జగిత్యాల, 5న రంగారెడ్డి జిల్లా చేవెళ్ల, 6న భూపాలపల్లి, 7న మెదక్, 8న నిజామాబాద్‌లో సీఎం రేవంత్ పర్యటిస్తారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా తొలి రోజు 890 మంది అభ్యర్థుల నుంచి 902 నామినేషన్లు దాఖలయ్యాయి. వీరిలో 382 మంది కాంగ్రెస్ అభ్యర్థులు, 258 మంది బీఆర్ఎస్ అభ్యర్థులు, 169 మంది భాజపా అభ్యర్థులు ఉన్నారు.

# కార్పోరేషన్ , మున్సిపల్ ఎన్నికలకు భారీ భద్రత

రాష్ట్రంలో మున్సిపల్ , కార్పోరేషన్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉందని డీజీపీ బి.శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల భద్రతా ఏర్పాట్లపై డీజీపీ బుధవారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఎన్నికలలో అక్రమ నగదు, మద్యం, మాదకద్రవ్యాలు, ఉచితాల పంపిణీని అడ్డుకోవడానికి తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్లను రంగంలోకి దించుతామన్నారు. 50 వేల రూపాయల కన్నా ఎక్కువ నగదును తీసుకు వెళుతున్నట్లయితే తగిన ఆధారాలు చూపించాలని, లైసెన్స్ కలిగిన ఆయుధాలను వెంటనే డిపాజిట్ చేయాలని, అక్రమ ఆయుధాల ఏరివేతకు ప్రత్యేక సోదాలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. పాత నేరస్తులు, రౌడీషీటర్లు, గత ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడిన వారిని గుర్తించి ఆర్థిక పూచీకత్తుతో బైండోవర్ చేస్తున్నామని వివరించారు. వెయ్యికి పైగా ఉన్న అతి సున్నిత, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రజల్లో భరోసా కల్పించేందుకు సాయుధ బలగాలతో 'ఫ్లాగ్ మార్చ్' నిర్వహిస్తామని డీజీపీ తెలిపారు.




ఎక్సయిజ్ , ఫారెస్ట్ శాఖలకు సంబంధించిన రెండు వేల మంది బందోబస్తు కోసం అందుబాటులో ఉంటారన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సహకారంతో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల నుంచి పంపిణీ, రిసెప్షన్ కేంద్రాలు కౌంటింగ్ హాల్స్ వరకు ప్రోటోకాల్ ప్రకారం అంచెలంచెల భద్రతను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## అనర్హత పిటిషన్‌ను కొట్టివేయాలి
# స్పీకర్‌కు దానం నాగేందర్ వినతి



హైదరాబాద్: బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌పై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అఫిడవిట్ దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారన్న పిటిషన్‌ను కొట్టి వేయాలని స్పీకర్‌కు విన్నవించారు. "నేను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదు. పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు నాకు సమాచారం లేదు. నేను 2024 మార్చిలో కాంగ్రెస్ సమావేశానికి వెళ్లాను. ఆ సమావేశానికి వ్యక్తిగత హోదాలో వెళ్లాను. మీడియా కథనాల ఆధారంగా నేను పార్టీ మారినట్లు బీఆర్ఎస్ భావిస్తోంది. ఆ పార్టీ అనర్హత పిటిషన్‌లోని అంశాలపై మాత్రమే వివరణ ఇస్తున్నాను. గతంలో కోర్టు తీర్పులను అనుసరించి ఆ అనర్హత పిటిషన్ చెల్లుబాటు కాదు. అనర్హత పిటిషన్ తర్వాత పరిణామాలను అనుబంధ సమాచారంగా అంగీకరించవద్దు" అని దానం నాగేందర్ కోరారు. ఈ నెల 30న విచారణకు రావాలని దానం నాగేందర్‌కు స్పీకర్ ప్రసాద్ కుమార్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే.



# దద్దరిల్లిన విద్యుత్ ఉద్యోగుల మహాధర్నా

ఉద్యోగ సంఘాలు, విద్యుత్ ఉద్యోగుల ఐక్యవేదికతో కనీసం సంప్రదించకుండా టీజీఎస్‌పీడీసీఎల్ యాజమాన్యం తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలను వ్యతిరేకిస్తూ విద్యుత్ ఉద్యోగ సంఘాలు ఏకమై ఐక్య జేఏసీగా ఏర్పడి చేపట్టిన మహాధర్నా కార్యక్రమం విజయవంతమైంది. విద్యుత్ ఉద్యోగుల ఐక్య జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం టీజీఎస్‌పీడీసీఎల్ పరిధిలో పని చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు, అధికారులు పెద్ద ఎత్తున తరలి వచ్చి... టీజీఎస్‌పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం వద్ద మహాధర్నా చేపట్టారు. ఉద్యోగుల హక్కుల విషయంలో యాజమాన్యం అవలంభిస్తున్న మొండి వైఖరికి వ్యతిరేకంగా చేసిన నినాదాలతో మింట్ కాంపౌండ్ దద్దరిల్లింది. యాజమాన్యం తీసుకుంటున్న ఏక పక్ష నిర్ణయాలను విరమించుకోవాలని లేని పక్షంలో మహాధర్నాతో ఆగిపోమని నాయకులు యాజమాన్యానికి హెచ్చరించారు. ధర్నా విరమించకుండా చర్చలను చేపట్టే ప్రసక్తే లేదని యాజమాన్యం మొండివైఖరిపై విద్యుత్ ఉద్యోగాలు మహాధర్నా సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంత కీలకమైన సమస్యలైనా చర్చల ద్వార పరిష్కరించుకోకుండా ఉద్యోగులతో వైరం పెంచుకుంటూ నియంతృత్వ ధోరణి అవలంభించడం మంచి పద్ధతి కాదని జేఏసీ చైర్మన్ జి.సాయిబాబు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. తమ సమస్యలపై యాజమాన్యం నుండి సరైన హామీ రాకపోవడంతో బుధవారం నుండి టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాలు కొనసాగించాలని నిర్ణయించామని జేఏసీ కన్వీనర్లు రత్నాకర్ రావు, శివాజీ తెలిపారు. గురువారం నుండి కార్పొరేట్ ఆఫీస్ తో పాటు జిల్లా కేంద్రాలలో రిలే నిరాహార దీక్షలు చేపట్టాలని అలాగే విద్యుత్ ఉద్యోగులు యాజమాన్యం యొక్క మొండి వైఖరికి నిరసనగా నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలుపాలని ఉద్యోగ సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక పిలుపు ఇచ్చింది.

# బారామతి.. 'అజిత్ దాదా'కు అల్విదా!




మహారాష్ట్ర రాజకీయాల్లో నాలుగు దశాబ్దాలుగా చక్రం తిప్పిన అజిత్ పవార్.. విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం రాష్ట్ర ప్రజలను శోకసంద్రంలో ముంచేసింది. ముఖ్యంగా దశాబ్దాలుగా ఆయన వెన్నంటే నిలిచిన బారామతి నియోజకవర్గ ప్రజలు ఆయన మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఆయన్ను రాజకీయ శక్తిగా మార్చిన నియోజకవర్గమే .. ఆయన చివరి అధ్యాయానికి వేదికగా మారిన విషయాన్ని తట్టుకోలేకపోతున్నారు. ఎంతో ఆప్యాయంగా దాదా అని పిలుచుకునే అజిత్ ఇక లేరనే విషయాన్ని దిగమింగుకుంటున్నారు.

**పవార్‌కు పర్యాయపదం..!**

పవార్ కుటుంబానికి బారామతికి విడదీయరాని అనుబంధం ఉందనే చెప్పవచ్చు. 1967 నుంచి శరద్ పవార్‌కు కంచుకోటగా ఉన్న ఈ అసెంబ్లీ నియోజకవర్గం 1991 నుంచి అజిత్ పవార్‌కు ఆశ్రయమిస్తోంది. అహల్యానగర్ జిల్లాలోని దేవ్‌లాలీ ప్రవర పట్టణంలో అజిత్ పవార్ జన్మించినప్పటికీ.. ఆయనకు రాజకీయ జన్మనిచ్చింది మాత్రం బారామతినే. ఈ నియోజకవర్గానికి 1967 నుంచి ఇప్పటివరకు వీరిద్దరే ప్రాతినిధ్యం వహిస్తూ పవార్ పేరుకే పర్యాయపదంగా మార్చుకోవడం గమనార్హం.

**కీలక సమయంలో దాదా వెంటే..**

రాజకీయంగా ఎదిగేందుకు అవకాశమిచ్చిన బారామతి ప్రజలకు అజిత్ పవార్ ఎప్పుడూ అందుబాటులో ఉండేవారు. అభివృద్ధితోపాటు క్షేత్రస్థాయిలో తిరుగుతూ స్థానికులకు మరింత దగ్గరయ్యారు. ముఖ్యంగా రాజకీయాలకు అతీతంగా పాల సంఘాలు, చక్కెర ఫ్యాక్టరీలు, సహకార బ్యాంకులు తదితర సహకార సంస్థల నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. అందుకే ఆయన్ను స్థానికులు ఆత్మీయంగా అజిత్ దాదా అని పిలుచుకుంటారు. దశాబ్దాలపాటు ఆయన వెంటే ఉంటున్న స్థానిక ఓటర్లు.. పార్టీ చీలిక సమయంలోనూ దిగ్గజ నేత శరద్ పవార్‌ను పక్కనపెట్టి అజిత్ వర్గానికే జై కొట్టారు. దీంతో తాము దాదా కుటుంబీకులమని బారామతి ప్రజలు నిరూపించుకున్నారని అజిత్ సతీమణి సునేత్రా అప్పట్లో పేర్కొన్నారు.

**బారామతిపై కినుక వహించి..**

పవార్ కుటుంబానికి కంచుకోటగా ఉన్న బారామతిలో కొంతకాలంగా అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్న విషయం తెలిసిందే. గత లోక్‌సభ ఎన్నికల్లో అజిత్ పవార్ తన సతీమణి సునేత్రను అభ్యర్థిగా నిలబెట్టగా.. శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలే పోటీకి దిగి విజయం సాధించారు. దీంతో బారామతి ప్రజలపై అలక వహించిన అజిత్.. ఇంకోసారి ఇక్కడి నుంచి పోటీ చేయనని ప్రకటించారు. ఆ తర్వాత మనసు మార్చుకున్న ఆయన.. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. ఇలా 1991 నుంచి ఇప్పటివరకు ఆయనే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. లోక్‌సభ స్థానమైనా.. అసెంబ్లీ నియోజకవర్గమైనా సుదీర్ఘ కాలంగా అవకాశమిస్తున్న బారామతి ప్రజలు 'అజిత్ దాదా'కు ఇక సెలవు చెబుతున్నారు.



## విమానం ఫిట్‌గా ఉంటే.. ఎలా గ్రౌండ్ చేస్తాం? వీఎస్ఆర్ ఏవియేషన్ సంస్థ

విమాన ప్రమాదంలో ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ దుర్మరణం పాలయ్యారు . వీఎస్ఆర్ సంస్థ కు చెందిన లియర్ జెట్ 45 మోడల్ విమానంలో ఆయన వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ లియర్‌జెట్ మోడల్ విమానం 2023లో కూడా ఇదే విధంగా ముంబయి విమానాశ్రయంలో క్రాష్‌ల్యాండ్ అయినట్లు జాతీయ మీడియా వర్గాలు తెలిపాయి. దీంతో ఈ మోడల్ విమానాలను నిర్వహించే సంస్థ పనితీరుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వీటిపై వీఎస్ఆర్ యజమాని వీకే సింగ్ మీడియాతో మాట్లాడుతూ..ప్రస్తుతం ప్రమాదానికి గురైన విమానంలో ఎలాంటి సాంకేతిక సమస్య లేదని వెల్లడించారు. ఈ ప్రమాదం నేపథ్యంలో ఇతర విమానాలను నిలిపివేస్తారా అని మీడియా అడిగిన ప్రశ్నకు వీఎస్ఆర్ ఏవియేషన్ యజమాని వీకే సింగ్ బదులిస్తూ.. తమ విమానాల ఫిట్‌నెస్‌ను ఎప్పటికప్పుడు పరీక్షిస్తామని అన్నారు. అవన్నీ ప్రయాణాలకు అనువుగానే ఉన్నాయన్నారు. విమానం ఫిట్‌గా ఉన్నప్పుడు.. గ్రౌండ్ చేయాల్సిన అవసరం ఏముంటుందని ప్రశ్నించారు. ప్రమాదంలో విమానాన్ని నడిపిన పైలట్లు కూడా అనుభవం లేని వారేమీ కాదని.. ఇన్ కమాండ్‌గా కెప్టెన్ సుమిత్ కపూర్‌కు 16,000 గంటల అనుభవం ఉందన్నారు. కో పైలట్ కెప్టెన్ శాంభవి పాఠక్‌కు విమానం నడపడంలో 1500 గంటల అనుభవం ఉందన్నారు.

**ప్రమాదానికి కారణమేంటంటే?**

ప్రమాద సమయంలో బారామతి ఎయిర్‌పోర్టులో విజిబులిటీ చాలా తక్కువగా ఉండడం వల్ల రన్‌వేను గుర్తించడంలో పైలట్లకు ఇబ్బందులు ఎదురైనట్లు పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. వారికి రన్‌వే సరిగ్గా కనిపించకపోవడం వల్లే ల్యాండింగ్ కోసం ప్రయత్నిస్తున్న సమయంలో విమానం కూలిందన్నారు. ఈ ఘటనపై మరింత సమాచారం కోసం చూస్తున్నామని, దీనిపై పారదర్శకంగా పూర్తిస్థాయి దర్యాప్తు చేపడతామన్నారు.

## అది ప్రమాదమే.. రాజకీయం చేయొద్దు – శరద్ పవార్

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మరణంపై ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ స్పందించారు. విమాన దుర్ఘటన పూర్తిగా ప్రమాదమేనని.. దీన్ని రాజకీయం చేయొద్దని అన్నారు. విమాన ప్రమాదంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అనుమానాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో తొలిసారి మీడియా ముందుకు వచ్చిన శరద్ పవార్.. అజిత్ మరణం



తీవ్ర దుఃఖాన్ని మిగిల్చిందన్నారు. "అజిత్ పవార్ అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. ఓ సమర్థుడైన నాయకుడిని రాష్ట్రం కోల్పోయింది. జరిగిన నష్టాన్ని పూడ్చలేం.. కానీ, ప్రతిదీ మన చేతుల్లో లేదు. ఈ ఘటనను రాజకీయం చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. ఇందులోకి రాజకీయాలు తీసుకురావద్దు. ఇది పూర్తిగా ప్రమాదమే. ఈ ఘటన నాతోపాటు రాష్ట్రం మొత్తానికి తీవ్ర దుఃఖాన్ని మిగిల్చింది. దయచేసి ఈ విషాదాన్ని రాజకీయం చేయొద్దు" అని శరద్ పవార్ విజ్ఞప్తి చేశారు. అంతకుముందు అజిత్ పవార్ విమాన ప్రమాదంపై మమతా బెనర్జీ స్పందిస్తూ.. ఇందులో కుట్ర కోణం ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సుప్రీం కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేసిన ఆమె.. అత్యున్నత న్యాయస్థానంపైనే తమకు నమ్మకం ఉందన్నారు. ఈ క్రమంలో ఇటువంటి ఊహాగానాలకు తెరదించేందుకే తాను మీడియా ముందుకు వచ్చినట్లు శరద్ పవార్ పేర్కొన్నారు.

## హానెస్టీ బాక్స్.. విద్యార్థుల నిజాయతీకి 'పరీక్ష'!

ఫిబ్రవరిలో నిర్వహించనున్న పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు మధ్యప్రదేశ్ ప్రభుత్వం అన్ని ఏర్పాటు చేస్తోంది. విద్యార్థులు కాపీ కొట్టకుండా సీసీటీవీ కెమెరాలు, యాప్ ఆధారిత ట్రాకింగ్ వ్యవస్థను అధికారులు సిద్ధం చేశారు. వీటితోపాటు విద్యార్థుల నిజాయతీ, నైతిక విలువలను పరీక్షించేందుకు మరో వినూత్న ప్రయత్నం చేస్తున్నారు. అదే 'హానెస్టీ బాక్స్'. ప్రతి పరీక్ష కేంద్రం ప్రవేశద్వారం వద్ద ఈ బాక్స్‌ను అమర్చనున్నారు. విద్యార్థులు ఎవరైనా చిట్టీలు, కాపీయింగ్‌కు దోహదపడే పరికరాలు తీసుకొస్తే ఈ పెట్టెలో వేసి పరీక్ష హాలులోకి వెళ్లవచ్చు. దీనివల్ల శిక్షల నుంచి తప్పించుకోవడంతో పాటు నిజాయతీతో పరీక్ష రాయాలనే అవగాహన పెంచడమే లక్ష్యంగా బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ హానెస్టీ బాక్స్.. విద్యార్థుల్లో నిజాయతీని, నైతిక బాధ్యతను గుర్తుచేస్తుందని అధికారులు తెలిపారు. ఈ విషయంపై మధ్యప్రదేశ్ బోర్డ్



ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ కార్యదర్శి బుద్ధేశ్ కుమార్ వైద్య మాట్లాడుతూ.. "పరీక్షలు పూర్తిగా పారదర్శకంగా జరగాలన్నదే మా ఉద్దేశం. ఎవరైనా అనవసరమైన వస్తువులు తెస్తే, పరీక్ష మొదలయ్యే ముందు వాటిని ఈ హానెస్టీ బాక్సుల్లో వదిలేసి, సొంతగా పరీక్ష రాయాలి" అని తెలిపారు. ప్రభుత్వం పరీక్షలను మరింత కట్టుదిట్టంగా నిర్వహించేందుకు హాల్ టికెట్‌లో క్యూఆర్ కోడ్ విధానాన్ని అమలు చేయనుంది. ఇన్విజిలేటర్ ఆ క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేసి విద్యార్థి వివరాలను ధ్రువీకరించవచ్చు. మరోవైపు ప్రశ్నపత్రాలు లీక్ కాకుండా ఉండేందుకు ట్రాకింగ్ అప్లికేషన్‌ను వినియోగించనుంది.






## అజిత్ పవార్ విమాన ప్రమాదం..

### 'రీడ్‌బ్యాక్' చేయని పైలట్: అసలేంటీ పదం..?

మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ ప్రయాణిస్తున్న విమానం బుధవారం ఉదయం బారామతిలో ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఆయనతో పాటు మరో నలుగురు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఉదయం 8.46 గంటలకు రన్‌వేకు 100 అడుగుల దూరంలో విమానం ప్రమాదానికి గురైనట్లు సీసీటీవీ దృశ్యాలను బట్టి వెల్లడైంది. దానికి 12 నిమిషాల ముందు ఏడీఎస్ బీ రేడియో సిగ్నళ్లను ప్రసారం చేయడం నిలిపివేసింది. వీటి ద్వారా ఎప్పటికప్పుడు విమానం లొకేషన్, వేగం తెలుస్తుంది. ఈ ఘటన గురించిన వివరాలను వెల్లడిస్తున్న సమయంలో పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు 'రీడ్‌బ్యాక్' అనే పదం వాడారు. ల్యాండింగ్ క్లియరెన్స్ సమయంలో పైలట్లు రీడ్‌బ్యాక్ చేస్తుంటారు. రీడ్‌బ్యాక్ అనేది ఒక ప్రొటోకాల్.. అందులో సందేశం ఏమీ ఉండదు. అయితే ల్యాండింగ్‌కు సంబంధించి అధికారిక అనుమతిని పొందే సమయంలో దీనిని వాడతారు. రీడ్‌బ్యాక్ అంటే ఒక సందేశాన్ని మళ్లీ చదవడమే. అంటే ఎయిర్‌క్రాఫ్ట్ సిబ్బంది, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ మధ్య సమన్వయ లోపం లేదని ఇది నిర్ధారిస్తుంది. ల్యాండింగ్ అవుతున్నప్పుడు ఈ రీడ్‌బ్యాక్ చాలా కీలకం. ఏ రన్‌వేను ఉపయోగించాలి.. వాతావరణం ఎలా ఉంది.. విమానం వేగం, ఎత్తు మార్చుకున్నప్పుడు.. విమానం ల్యాండ్ అయ్యే ప్రాంతంలో ట్రాఫిక్ ఎలా ఉందనే విషయాలపై పైలట్, ఏటీసీ మధ్య కమ్యూనికేషన్‌కు ఇది ఉపయోగపడుతుంది. అయితే తాజా ఘటనలో లియర్‌జెట్ పైలట్ శాంభవి పాఠక్.. ఈ రీడ్‌బ్యాక్ ఇవ్వలేదు. రన్‌వే కనిపిస్తుందా? లేదా అని పైలట్లను బారామతి ఏటీసీ అధికారులు అడిగారని, కనిపించడం లేదనే సమాధానం వచ్చిందన్నారు. దాంతో విమానం గాల్లో కొంతసేపు చక్కర్లు కొట్టినట్లు కేంద్ర మంత్రి వివరించారు. రెండోసారి ల్యాండింగ్‌కు ప్రయత్నించే సమయంలో రన్‌వే కనిపిస్తుందా? అని ఏటీసీ అడిగినప్పుడు పైలట్లు సానుకూలంగా స్పందించారని తెలిసిందన్నారు. దీంతో ల్యాండింగ్ కోసం ఏటీసీ క్లియరెన్స్ ఇచ్చిందని.. ఆ వెంటనే విమానం కూలిపోయిందన్నారు.

## అజిత్ పవార్ విమానంలో యువ పైలట్.. ఎవరీ శాంభవి పాఠక్?

మహారాష్ట్రలోని బారామతిలో జరిగిన విమాన ప్రమాదంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్‌తో పాటు మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో యువ పైలట్ కెప్టెన్ శాంభవి పాఠక్ ఒకరు. చిన్న వయసులోనే కమర్షియల్ విమానాలు నడిపే లైసెన్స్ పొందిన ఆమె.. ప్రస్తుతం ప్రమాదం జరిగిన విమానంలో ఫస్ట్ ఆఫీసర్‌గా ఉన్నారు. శాంభవి పాఠక్ ఎయిర్‌ఫోర్స్ బాలభారతి స్కూల్‌లో చదువుకున్నారు. 201618 మధ్య సెకండరీ విద్యను పూర్తిచేసుకున్న ఆమె.. ముంబయి యూనివర్సిటీ నుంచి ఏరోనాటిక్స్, ఏవియేషన్, ఏరోస్పేస్ సైన్స్ అండ్



టెక్నాలజీలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ డిగ్రీ పొందారు. న్యూజిలాండ్ ఇంటర్నేషనల్ కమర్షియల్ పైలట్ అకాడమీలో కమర్షియల్ పైలట్ శిక్షణ తీసుకుని లైసెన్స్ పొందారు. ఆ తర్వాత భారత్‌కు వచ్చి డీజీసీఏ నుంచి కమర్షియల్ పైలట్ లైసెన్స్‌తో పాటు ఫ్రోజెన్ ఎయిర్‌లైన్ ట్రాన్స్‌పోర్ట్ పైలట్ లైసెన్స్ కూడా పొందారు. కొత్త పైలట్లకు శిక్షణ ఇచ్చేలా అసిస్టెంట్ ఫ్లైట్ ఇన్‌స్ట్రక్టర్‌గానూ పనిచేశారు. 2022 ఆగస్టు నుంచి వీఎస్ఆర్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఫుల్ టైమ్ ఫస్ట్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వీఐపీలు, బిజినెస్ ప్రముఖులు ప్రయాణించే లియర్‌జెట్ 45 లాంటి విమానాలను నడుపుతున్నారు. బుధవారం అజిత్ పవార్ ప్రయాణించిన లియర్‌జెట్ 45 విమానంలో పైలట్ ఇన్ కమాండ్‌గా కెప్టెన్ సుమిత్ కపూర్ వ్యవహరించగా.. శాంభవి ఫస్ట్ ఆఫీసర్‌గా పనిచేశారు. ఈ ప్రమాదంలో సుమిత్ కూడా ప్రాణాలు కోల్పోయారు. కెప్టెన్ సుమిత్‌కు 16,500 గంటలు విమానం నడిపిన అనుభవం ఉంది.

## మీ విశ్వసనీయ ప్రభుత్వం': అజిత్ పవార్ చివరి ఎక్స్ పోస్ట్

విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ ప్రాణాలు కోల్పోయిన వేళ చివరిసారిగా ఆయన చేసిన సోషల్ మీడియా పోస్టు వైరల్‌గా మారింది. ఇటీవల రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ప్రమాదం జరగడానికి కొన్ని గంటల ముందు అజిత్ పవార్ మహారాష్ట్ర ప్రజలకు సోషల్ మీడియా వేదికగా తెలిపారు. మంత్రివర్గ సమావేశంలో భాగంగా 'మీ విశ్వసనీయ ప్రభుత్వం' తీసుకున్న పలు ముఖ్యమైన నిర్ణయాలు అని పేర్కొంటూ.. రాష్ట్రంలో వృత్తి శిక్షణా సంస్థలను ఏర్పాటుచేయడం, కాంట్రాక్టర్ల చెల్లింపు వ్యవస్థల్లో మార్పులు చేయడం, ప్రైవేటు కంపెనీలకు కేటాయించిన ప్రభుత్వ భూమి లీజు కాలాల పొడిగింపు వంటి విషయాలను వెల్లడించారు. త్వరలో ముంబయి, పుణె సహా పలు నగరాల్లో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో సీఎం దేవేంద్ర ఫడణవీస్ నేతృత్వంలోని రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను అజిత్ పవార్ వెల్లడించారు.

*** విమాన ప్రమాదం.. అజిత్ పవార్‌ను ఎలా గుర్తుపట్టారంటే..!**

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదానికి సంబంధించి మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రమాదం జరిగిన తర్వాత నాలుగైదు పేలుడు శబ్దాలు వినిపించాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కళ్లద్దాలు, వాచీ చూసి ప్రమాదానికి గురైంది అజిత్ పవార్ అని తాము గుర్తించినట్లు తెలిపారు. "ప్రమాదం మా కళ్ల ముందే జరిగింది. విమానం ఉన్నట్టుండి కిందకు వస్తుంటే అది కూలిపోయేలా ఉందని అనిపించింది. ఆ సమయంలో విమానం నుంచి శబ్దం కూడా చాలా భిన్నంగా వచ్చింది. చూస్తుండగానే ఒక్కసారిగా కిందపడింది. భారీ పేలుడు శబ్దం వచ్చి పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. ఆ తర్వాత కూడా నాలుగైదు సార్లు పేలుడు శబ్దాలు వినిపించాయి. అవి విని చాలామంది ఘటనాస్థలానికి చేరుకున్నారు. అందులోని వ్యక్తులను బయటకు లాగేందుకు ప్రయత్నించాం. ప్రమాద తీవ్రతకు రెండు మృతదేహాలు బయటకు ఎగిరిపడినట్లుగా అనిపించింది. గాగుల్స్, చేతివాచీతో అజిత్ పవార్‌ను గుర్తించి బయటకు లాగాం. కానీ, అప్పటికే నష్టం జరిగిపోయింది. ఈ ఘటన మమ్మల్ని తీవ్రంగా కలచివేసింది" అని ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. ఈ ఘటనపై డీజీసీఏ అధికారులు స్పందించారు. "ఇది టేబుల్ టాప్ రన్‌వే (ఎత్తైన కొండల ప్రాంతాల్లో ఉండే). విమానం ల్యాండ్ అయ్యేందుకు ప్రయత్నిస్తుండగా రన్‌వే స్టార్టింగ్ పాయింట్‌లో ఇది కుప్పకూలింది" అని వెల్లడించారు.


దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతర... మేడారం. రెండేళ్లకోసారి కోలాహలంగా జరిగే ఈ మహా జాతర బుధవారం ప్రారంభమైంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. దీంతో మేడారంలోని రహదారులన్నీ రద్దీగా మారాయి. మేడారం భక్తజన సంద్రంగా మారింది. ఆ ఫొటోలివి..

# మేడారం మహాజాతర..
# పోటెత్తిన భక్తులు











## అట్టహాసంగా సారక్క ఆగమనం.. పూజారుల నృత్యాలు, పూనకాలతో దద్దరిల్లిన మేడారం

మేడారం గద్దెపైకి సారక్క చేరుకుంది. గిరిజన ఆచారాల సాక్షిగా, లక్షలాది భక్తుల కోలాహలం మధ్య సమ్మక్క కూతురు గద్దెను చేరింది. కన్నెపల్లి గ్రామం నుండి డప్పుల దరువులు, పూజారుల నృత్యాలు, భక్తుల పూనకాల మధ్య గద్దెలపై కొలువుదీరింది. సారక్క భర్త గోవింద రాజు కొండాయి నుండి, సమ్మక్క భర్త పగిడిద్ద రాజు పూను గోండ్ల నుండి మేడారానికి విచ్చేసిన సంగతి తెలిసిందే.

**కట్టుదిట్ట భద్రతా ఏర్పాట్లు..**


మేడారం జాతర నేపథ్యంలో సారక్క గద్దెనెక్కుతున్న క్రమంలో అధికారులు భారీ కట్టుదిట్ట ఏర్పాట్లు చేశారు. లక్షలాదిగా తరలివస్తున్న భక్తుల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు. అమ్మవారి దర్శనానికి లక్షలాది భక్తులు ఎదురుచూస్తుండటంతో మేడారం ఆధ్యాత్మికతతో నిండిపోయింది. సారక్క ఆగమనం జరుగుతున్న క్రమంలో మేడారం ఆలయ ప్రాంగణాన్ని పూర్తిగా ఖాళీ చేయించారు. శుద్ధి కార్యక్రమాలు కొనసాగించారు.






# సినిమా

## ‘కింగ్ 100’లో టబు..
## నాగార్జున ఏమన్నారంటే!



కుర్ర హీరోలతో పోటీగా సినిమాలు చేస్తూ వెండితెరపై సందడి చేస్తున్నారు అగ్ర కథానాయకుడు నాగార్జున. గతేడాదిలో రెండు చిత్రాల్లో కనిపించి ఆకట్టుకున్న ఆయన ఇప్పుడు తన వందో సినిమా పనుల్లో బిజీగా ఉన్నారు. ఇందులో సీనియర్ నటి టబు నటించనున్నట్లు ఎప్పటి నుంచో వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ విషయంపై నాగార్జున ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. తాను, టబు ఎన్నో ఏళ్లుగా స్నేహితులమని తెలిపారు. ఆమె ఇండస్ట్రీకి వచ్చినప్పటి నుంచి తెలుసన్నారు. వందో సినిమా చేస్తున్నా అని తెలియగానే అందులో భాగం కావాలని టబు కోరుకున్నట్లు చెప్పారు. దీంతో ఎన్నో రోజుల నుంచి వస్తోన్న వార్తలకు మరింత బలం చేకూరింది. గతంలో వీరిద్దరూ ‘నిన్నే పెళ్లాడతా’, ‘ఆవిడా మా ఆవిడే’లో నటించిన విషయం తెలిసిందే. ఇక ఈ సినిమా గురించి నాగార్జున మాట్లాడుతూ.. ‘‘ప్రేక్షకుల అభిరుచులు వేగంగా మారుతున్నాయి. మేం వాళ్ల కోసం ప్రత్యేకమైన చిత్రాన్ని అందిస్తున్నామని అందరికీ తెలియాలి. ఆడియన్స్ వాస్తవికతకు దగ్గరగా ఉండే వాటిని ఇష్టపడుతున్నారు. అందుకే ఇందులో యాక్షన్ సన్నివేశాలు వీఎఫ్ఎక్స్ ఆధారంగా కాకుండా రియల్‌గా ఉండేలా ప్లాన్ చేస్తున్నాం. కథకు తగ్గట్టు సహజంగా దీన్ని రూపొందిస్తున్నాం’’ అని నాగార్జున తెలిపారు. రిలీజ్ తేదీ విషయంలో కూడా తాను తొందరపడి నిర్ణయాలు తీసుకోవట్లేదని చెప్పారు. నాగ్ వందో సినిమా విషయానికొస్తే.. గతేడాది ‘కూలీ’, ‘కుబేర’ లాంటి చిత్రాలతో అలరించిన ఆయన తమిళ దర్శకుడు రా.కార్తీక్ దర్శకత్వంలో నటిస్తోన్న చిత్రమిది. ‘కింగ్ 100’ అనే వర్కింగ్ టైటిల్‌తో ప్రచారంలో ఉంది. యాక్షన్ ప్రధానంగా సాగే ఈ చిత్రంలో నాగార్జున కనిపించే విధానం కొత్తగా ఉంటుందని, ఇందులో ముగ్గురు కథానాయికలు ఉండనున్నట్లు సమాచారం.

## రజనీకాంత్ ఆటోబయోగ్రఫీ..
## ఐశ్వర్య ఆసక్తికర వ్యాఖ్యలు



రజనీకాంత్.. నటుడిగానే కాదు వ్యక్తిగానూ ఎందరికో ఆదర్శం. బస్ కండక్టర్ నుంచి సూపర్‌స్టార్‌గా సాగిన ప్రయాణం స్ఫూర్తిదాయకం. రజనీకాంత్ జీవితం తెరపైకి వస్తుందంటూ కొన్నాళ్ల క్రితం ప్రచారం జరిగింది. ఆ బయోపిక్ గురించి అధికారిక ప్రకటన కూడా లేదు. అయితే, తాజాగా రజనీ కుమార్తె ఐశ్వర్య అభిమానులకు శుభవార్త చెప్పారు. తన తండ్రి ఆటోబయోగ్రఫీ వర్క్‌ను ఇప్పటికే ప్రారంభించారని తెలిపారు. అది ప్రపంచవ్యాప్తంగా ఓ సెన్సేషన్ అవుతుందంటూ ఓ ఇంటర్వ్యూలో ఆసక్తి రేకెత్తించారు. సూపర్‌స్టార్ కుమార్తెగా ఉండటం అంత తేలికైన విషయం కాదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సినీ రంగంలో ఏఐ వినియోగం మంచి పరిణామమే అయినా.. అది ఎప్పటికైనా కృత్రిమమే అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అభిప్రాయపడ్డారు. ‘కోచ్చాడయాన్’ లాంటి సినిమాలు తీయడం తనకు ఇష్టమన్నారు. అధునాతన సాంకేతికతో అలాంటి చిత్రాలను ఇప్పుడు తెరకెక్కించడం సులువు అని పేర్కొన్నారు. ‘3’, ‘లాల్ సలామ్’లాంటి చిత్రాలకు దర్శకత్వం వహించిన ఐశ్వర్య ‘విత్ లవ్’ కు నిర్మాతగా వ్యవహరించారు. ‘టూరిస్ట్ ఫ్యామిలీ’ డైరెక్టర్ అభిషన్ జీవింత్ హీరోగా మదన్ తెరకెక్కించిన రొమాంటిక్ మూవీ ఇది. అనస్వర రాజన్ హీరోయిన్. ఈ సినిమా తెలుగులోనూ ఫిబ్రవరి 6న విడుదల కానుంది.

## ప్రతి సినిమాకు భారీ సెట్స్..
## గుణశేఖర్‌కు మహేశ్‌బాబు హెచ్చరిక

గుణశేఖర్.. ఈ పేరు చెబితే ప్రతి తెలుగు ప్రేక్షకుడికి గుర్తొచ్చేది ఆయన వేసిన భారీ సెట్స్. ‘చూడాలని వుంది’ మొదలుకుని, ‘ఒక్కడు’, ‘అర్జున్’, ‘సైనికుడు’ ఇలా ప్రతి సినిమాకూ భారీ సెట్స్ వేశారు. అప్పట్లో అదో ట్రెండ్ సెట్టర్. ఇలా వరుసగా సెట్స్ వేస్తూ సినిమాలు తీయడం కూడా తనని దెబ్బ కొట్టిందని ఆయన అభిప్రాయం వ్యక్తంచేశారు. ఈ విషయంలో అగ్ర కథానాయకుడు మహేశ్‌బాబు కూడా హెచ్చరించారని తాజాగా ఓ ఇంటర్వ్యూలో నాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. ‘‘భారీ సెట్స్ వేసి సినిమాలు తీయడం నన్ను దెబ్బ కొట్టింది. ‘సైనికుడు’ సమయంలో వేయి స్తంభాల గుడి సెట్ వేశాం. అప్పటికే నేను ఆ ట్రాప్‌లో పడ్డాను. ఈ మూవీ షూటింగ్ సమయంలో మహేశ్‌బాబు నన్ను హెచ్చరించారు. ‘సెట్స్ భారీగా వేయడం వల్ల అక్కడే ఎక్కువ వర్క్ చేయాలనే ఉద్దేశం పెరుగుతోంది. దీంతో కథ అటువైపు తిరుగుతోందని అనిపిస్తోంది’ అని సున్నితంగా హెచ్చరించారు. ఆలోచిస్తే, అది కూడా నిజమేనని అనిపించింది. సెట్ వేశాం కదాని, అక్కడ సన్నివేశాలు పెంచడం, డేలో ఒక పాట, నైట్ ఎఫెక్ట్‌లో మరో పాట తీయడం. దీంతో కథ లిమిట్ అయిపోతోంది.

## ఎలిగెంట్ లుక్



బాలీవుడ్ నుండి టాలీవుడ్ వరకు తన అందం, అభినయంతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా.. సోషల్ మీడియాలో మరోసారి సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. తాజాగా ఆమె పోస్ట్ చేసిన ఫోటోలు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. ఎప్పుడూ ట్రెండీగా ఉండే తమన్నా ఈసారి క్లాసిక్, ఎలిగెంట్ లుక్ లో మెరిసిపోతూ యువత గుండెల్లో సెగలు పుట్టిస్తోంది. మినిమల్ మేకప్, సింపుల్ హెయిర్ స్టైల్, ఆమె సిగ్నేచర్ స్మైల్‌తో కెమెరాకు ఫోజులిచ్చిన తీరు నెటిజన్లను కట్టిపడేస్తోంది. ఎలిగెన్స్ అంటే కేవలం బట్టలు మాత్రమే కాదని, అది మన ఆటిట్యూడ్‌లో ఉంటుందని చెప్పకనే చెప్పింది. స్టైలిష్ అవుట్‌ఫిట్‌లో మెరిసిపోతున్న మిల్కీ బ్యూటీని చూసి అభిమానులు క్వీన్ ఆఫ్ స్టైల్, ఎవర్ గ్రీన్ బ్యూటీ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. కేవలం కొద్ది నిమిషాల్లోనే ఈ ఫోటోలు లక్షలాది లైకులను సంపాదించుకోవడం ఆమె క్రేజ్ కు నిదర్శనం.

## ఏంటా బిజినెస్?

కలర్ ఫొటో, రైటర్ పద్మభూషణ్, అంబాజీపేట మ్యారేజీ బ్యాండు, ఉప్పు కప్పురంబు, ఓ భామ అయ్యే రామ వంటి విభిన్న కథా సినిమాలతో ఆకట్టుకున్న నటుడు సుహాస్.. ఇప్పుడు మరో కొత్త కాన్సెప్ట్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమయ్యాడు. ఆయన ప్రధానపాత్రలో నటిస్తోన్న లేటెస్టు మూవీ ‘హే భగవాన్’. దర్శకుడు గోపి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో శివానీ నాగారం హీరోయిన్ గా నటిస్తోంది. నరేశ్, వెన్నెల కిశోర్, సుదర్శన్‌కీలక పాత్రలో కనిపించనున్నారు. త్రిశూల్‌బ్యానర్ పై నరేంద్ర రెడ్డి నిర్మిస్తున్న ఈ మూవీ ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా దీని టీజర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఎలాగైనా నాన్న బిజినెస్‌ను తాను టేకప్ చేయాలని తాపత్రయ పడే పాత్రలో సుహాస్ నవ్వులు పూయిస్తున్నాడు. ‘ఎంతో మంది ఇళ్లలో దీపాలు వెలిగించాడండీ’ అనే డైలాగులతో పాటు శివాని నాగారం జోక్స్ ఆకట్టుకుంటున్నాయి.



### 27 ఏండ్ల తర్వాత
## జోడీ రిపీట్!

టాలీవుడ్‌లో 4 దశాబ్దాలుగా తనదైన స్టైల్, ప్రయోగాత్మక సినిమాలతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న స్టార్ హీరో అక్కినేని నాగార్జున ఇప్పటికీ అదే క్రేజ్‌తో ముందుకెళ్తున్నాడు. రొమాంటిక్ హీరోగా మొదలై, యాక్షన్, ఫ్యామిలీ, క్లాస్, మాస్‌తో పాటు ఇప్పుడు నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రల్లో కూడా ప్రేక్షకుల్ని అలరిస్తున్నాడు. వయసు సంఖ్య మాత్రమేనని, నటనకు హద్దులుండవని ప్రతి చిత్రంతో నిరూపిస్తూనే ఉన్న ఈ టాలీవుడ్ మన్మథుడు.. ప్రస్తుతం తన 100వ మూవీని ఎంతో ప్రత్యేకంగా ప్లాన్ చేస్తున్నాడు. తమిళ దర్శకుడు రా కార్తీక్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి ‘కింగ్ 100’ లేదా ‘లాటరీ కింగ్’ అనే టైటిల్‌స్‌ను పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఈ ఏడాది సమ్మర్ కానుకగా విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. అయితే ఇందులో నాగ్ సరసన ఎవరూ ఊహించని విధంగా సీనియర్ నటి టబు కనిపించబోతున్నారనే వార్త ఇప్పుడు సినీ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ‘నిన్నే పెళ్లాడుతా’, ‘ఆవిడ మా ఆవిడే’ వంటి సినిమాలతో ఈ జోడీ వెండితెరపై మ్యాజిక్ చేసింది. కార్తీక్ ఆమె కోసం ఒక పవర్‌ఫుల్ అండ్ కీ రోల్‌ను డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ఇక దాదాపు 27 ఏండ్ల తర్వాత మళ్లీ వీరు కలిసి నటించబోతున్నారన్న వార్త వినగానే అక్కినేని ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు.



## ‘దృశ్యం 3’.. ఎవరి మాట వారిదే.. ఏది నిజమో!

విడుదలైన అన్ని భాషల్లోనూ ప్రేక్షకులను థ్రిల్ చేసిన మూవీ ఫ్రాంచైజీ ‘దృశ్యం’. ఈ సిరీస్‌లో మూడో భాగం ఇటు మలయాళంలో, అటు హిందీలో తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే విడుదల తేదీలూ ఖరారయ్యాయి. హిందీ ‘దృశ్యం’, ‘దృశ్యం 2’పై పెద్దగా చర్చ జరగలేదుగానీ ‘దృశ్యం 3’ స్టోరీపై మాత్రం రూమర్స్ వస్తూనే ఉన్నాయి. వేరే కొత్త కథతో హిందీ ‘దృశ్యం 3’ని తెరకెక్కిస్తున్నారంటూ జరిగిన ప్రచారాన్ని ఇప్పటికే.. మాతృక మూవీ దర్శకుడు జీతూ జోసెఫ్ ఖండించారు. తాను రాసిన కథతోనే హిందీ చిత్రం కూడా రూపొందుతుందన్నారు. కానీ, ఆ సినిమా హీరోయిన్ శ్రియ కామెంట్స్‌తో సినీ ప్రియుల్లో మరోసారి చర్చ మొదలైంది. తాజాగా పాల్గొన్న







ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. మలయాళం ‘దృశ్యం 3’కి చాలా భిన్నంగా హిందీ ‘దృశ్యం 3’ ఉంటుందని తెలిపారు. ‘దృశ్యం’ ఫ్రాంచైజీ తనకు ఓ ఎమోషనల్ జర్నీ అని పేర్కొన్నారు. రెండు భాగాలను మించి మూడో భాగం ఉంటుందన్నారు. మరి, ఎవరి మాట నిజమో తెలియాలంటే కొన్ని రోజులు ఆగాల్సిందే. మలయాళం ‘దృశ్యం 3’ ఏప్రిల్ 2న, హిందీ ‘దృశ్యం 3’ అక్టోబరు 2న విడుదల కానున్నాయి. మలయాళంలో ‘దృశ్యం’ మూడు భాగాలకు జీతూ జోసెఫ్ దర్శకుడు. మోహన్‌లాల్ హీరో. హిందీలో ‘దృశ్యం’ను నిషికాంత్ కామత్ రూపొందించగా.. ‘దృశ్యం 2’, ‘దృశ్యం 3’ సినిమాకు అభిషేక్ పాఠక్ డైరెక్టర్. అజయ్ దేవ్‌గణ్ కథానాయకుడు. తెలుగులోనూ ‘దృశ్యం 3’ త్వరలో పట్టాలెక్కే అవకాశాలున్నాయి. త్రివిక్రమ్ దర్శకత్వంలో నటిస్తున్న ‘ఆదర్శ కుటుంబం’ పూర్తయ్యాక.. వెంకటేశ్ ‘దృశ్యం 3’ మొదలుపెడతారని సమాచారం.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.